# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 117 | విశాఖపట్నం | 28-1-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 117 | VISAKHAPATNAM | 28-1-2026 WEDNESDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేద్దాం: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన నిర్మాణాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను ప్రపంచంలోనే అతిపెద్ద ఉద్యాన క్లస్టర్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో 10 జిల్లాలను ఉద్యాన కేంద్రాలుగా మార్చే సమీకృత అభివృద్ధి ప్రణాళికలపై మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, అనేక ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టిందని ఈ సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, 10 జిల్లాల పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. తక్కువ నిధులతో త్వరగా పూర్తయ్యే వాటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ ఏడాదిలోనే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణకు వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గాలేరు-నగరి ద్వారా కృష్ణా జలాలను కడప వరకు తీసుకెళ్లే అంశంపై దృష్టి సారించాలన్నారు. మొత్తంగా 20కి పైగా ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా కొత్తగా 8.87 లక్షల ఎకరాల ఆయకట్టుకు, మరో 4.30 లక్షల ఎకరాల స్థిరీకరణకు నీరందించవచ్చని అధికారులు సీఎంకు వివరించారు. ఇదే సమయంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ ప్రాజెక్టులు చేపట్టాలని, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయితే గోదావరి జలాలను ఉత్తరాంధ్ర వరకు తీసుకెళ్లి, పోలవరం-వంశధార నదుల అనుసంధానం చేపట్టవచ్చని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ఉద్యాన పంటల సాగు గణనీయంగా పెరుగుతుందని మంత్రి అచ్చెన్నాయుడు అభిప్రాయపడ్డారు. గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా 500 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను పండించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని 10 జిల్లాల్లో 201 క్లస్టర్లు, 303 మండలాల్లో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. మూడేళ్లలో ఉద్యాన సాగు విస్తీర్ణాన్ని 8.41 లక్షల హెక్టార్ల నుంచి 14.41 లక్షల హెక్టార్లకు పెంచేలా ప్రణాళికలు రూపొందించారు. దుబాయ్?కి చెందిన డీపీ వరల్డ్ సంస్థ ఏపీలో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చిందని సీఎం వెల్లడించారు. (తరువాయి 2వ పేజీలో)



2లో

## భారత్- ఇయుల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం



6లో

## తల ఎందుకు తిరుగుతుంది? కారణాలు ఏంటి?



2లో

## ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగుల సమ్మె.. కస్టమర్లకు ఇక్కట్లు



2లో

## బంగ్లాదేశ్ జైలు నుంచి 23 మంది భారత మత్స్యకారుల విడుదల..

## శ్రీశైలం టోల్‌గేట్ వద్ద భారీగా నగదు పట్టివేత



**శ్రీశైలం, పతాకం న్యూస్:** శ్రీశైలం టోల్‌గేట్ వద్ద భారీగా నగదు పట్టుబడటం కలకలం రేపుతోంది. దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది నిర్వహించిన వాహనాల తనిఖీల్లో మహారాష్ట్రకు చెందిన ఓ వాహనంలో రూ.30 లక్షల నగదును గుర్తించారు అధికారులు. టోల్?గేట్ వద్ద జరిగిన సోదాల్లో ఈ వాహనాన్ని ఆపి సెక్యూరిటీ సిబ్బంది వివరాలు ఆరా తీయగా.. కారు సీట్ కింద ఉన్న బ్యాగులో భారీ మొత్తంలో నోట్ల కట్టలు లభించాయి. నగదుపై కారులోని వ్యక్తులు పొంతనలేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. ఆ నగదుకు సంబంధించి సరైన పత్రాలనూ చూపలేకపోయారు.

# పార్టీలో మార్పులు రావాలి: లోకేశ్





**అమరావతి, పతాకం న్యూస్:** మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలోనూ మార్పులు రావాలని, గ్రామ స్థాయి పార్టీ అధ్యక్షుడు పొలిట్‌బ్యూరో స్థాయి వరకు ఎదిగేలా సంస్కరణలు చేపట్టాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. పార్టీకి కార్యకర్తలే బలం, బలగం అని, వారి త్యాగాల పునాదులపైనే తెలుగుదేశం పార్టీ నిలబడి ఉందని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నూతనంగా నియమితులైన 25 పార్లమెంట్ నియోజకవర్గాల కమిటీల కోసం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేశ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకి లేని బలమైన కార్యకర్తల వ్యవస్థ ఒక్క తెలుగుదేశానికే సొంతమని లోకేశ్ అన్నారు. "స్వర్గీయ ఎన్టీఆర్ ఏ ముహూర్తంలో పార్టీ స్థాపించారో కానీ, మన బలం, బలగం మన కార్యకర్తలే. పుంగనూరులో నామినేషన్ పత్రాలు లాక్కున్నప్పుడు మీసాలు మెలేసిన అంజిరెడ్డి తాత, మాచర్లలో రక్తమోడుతున్నా పోలింగ్ బూత్‌లో నిలబడిన మంజుల, విజయవాడలో కంటిచూపు కోల్పోయినా జై టీడీపీ అన్న చెన్నుపాటి గాంధీ, మెడపై కత్తిపెట్టినా జై చంద్రబాబు అని ప్రాణాలు విడిచిన తోట చంద్రయ్య వంటి కార్యకర్తలే నాకు స్ఫూర్తి" అని ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసిందే టీడీపీ అని లోకేశ్ గుర్తుచేశారు. "1983లోనే రూ.2కే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, మహిళలకు ఆస్తి హక్కు వంటివి ఎన్టీఆర్ తెచ్చారు. ఆయన స్ఫూర్తితో సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల బండిలా చంద్రబాబు ముందుకు నడిపిస్తున్నారు. దేశంలో అభివృద్ధి, సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ ఆయనే. 75 ఏళ్ల వయసులో కూడా ఆయనలో ముగ్గురు 25 ఏళ్ల యువకులు ఉన్నారు. నిత్యం ప్రజల గురించే ఆలోచిస్తారు" అని కొనియాడారు. చంద్రబాబు ముందుచూపు వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని లోకేశ్ తెలిపారు. 1995లో ఐటీ గురించి మాట్లాడితే ఎగతాళి చేశారని, కానీ నేడు సైబరాబాద్ వల్లే లక్షలాది కుటుంబాలు బాగుపడ్డాయని అన్నారు. "మన నాయకుడు అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ అయితే, కల్తీ నెయ్యి, (తరువాయి 2వ పేజీలో)


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## సమ్మె

ఎల్ఐసిలో పెట్టుబడుల ఉపసంహరణను నిరసిస్తూ, తక్షణం సిబ్బంది నియామకాలు చేపట్టాలని, ఉద్యోగులం దరికీ గ్యారంటీ పింఛను సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు కలిసి ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిూస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) సమరశీలంగా పాల్గొనబోతోంది. కేంద్ర కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేయడానికి ముందుకు వెళ్తున్న తీరు అభ్యంతరకరం. ఈ విషయమై నవంబర్ 26, 2025న భోజన విరామ సమయంలో దేశవ్యాప్తంగా బీమా ఉద్యోగులు భారీ నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. లేబర్ కోడ్స్?ను 'ప్రోగ్రెసివ్' అని, 'మోడర్న్' అని గోదీ మీడియా ఎంతగా దంకా బజాయించినా, అవి కార్పొరేట్ ప్రయో జనాలకు అంట కాగుతున్నాయనే విషయం దాగేది కాదు. ఈ లేబర్ కోడ్స్ 'ఈజ్ ఆఫ్ లివింగ్' కోసం కాకుండా 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' కోసం ఉద్దేశించాయన్నది బహిరంగ రహస్యం. ఇప్పటిదాకా ఉన్న కార్మిక చట్టాలు కార్మికులకు, ఉద్యోగులకు ఎంతో కొంత రక్షణ ఇచ్చాయి. పాలసీదారుల సంక్షేమమే ధ్యేయంగా 1956 నుండి పనిచేయబట్టే ,అంతై ఇంతై వటుడింతింతైనట్లు ఎల్?ఐసి నేడు 57 లక్షల కోట్ల రూపాయల మేర ఆస్తులున్న సంస్థగా ఎదిగింది. 27 కోట్ల మంది పాలసీదారులకు సేవలు అందిస్తూ, 140 కోట్ల మంది భారతీయుల ఆదరణ చూరగొన్నది. ప్రైవేటు బీమా కంపెనీల అనైతిక పోటీని 25 ఏళ్ల నుండీ తట్టుకుని 63 శాతం వాటాతో మార్కెట్? లీడర్?గా అప్రతిహత జైత్రయాత్ర కొనసాగిస్తున్నది. గత పార్లమెంట్? సమావేశాల్లో ఆమోదించిన బీమా చట్ట సవరణ బిల్లు 2025 ప్రకారం ఈ రంగంలో విదేశీ పెట్టుబడులను 74% నుంచి 100%కి పెంచారు. ఇప్పుడు ఎల్?ఐసిలో మరిన్ని ప్రభుత్వ వాటాల విక్రయం చేయాలని ,సంస్థను ముక్కలు చేయాలన్న విపరీత ప్రతిపాదనలు, ప్రభుత్వ సాధారణ బీమా కంపెనీల ప్రయివేటీకరణ డిమాండ్లు ముందుకు వస్తున్నాయి. స్విస్? రే సర్వే నివేదిక ప్రకారం ఇండియాలో ఇన్సూరెన్స్? ప్రీమియంలు 2026-2030 మధ్య 6.9% పెరగనున్నాయి. దీంతో దేశీయ బీమాపై దాడులు అధికమయ్యాయి. ఎల్ఐసిలో ఐపిఓ పేరుతో ఇప్పటికే 3.5% ప్రభుత్వ వాటాలు అమ్మి రూ 21,000 కోట్లు తన ఖాతాలో వేసుకున్న ప్రభుత్వం, మళ్లీ ఎఫ్?పిఓ పేరుతో మళ్లీ వాటాలు అమ్మాలని ప్రయత్నిస్తోంది. దీంతో 100% విదేశీ పెట్టుబడులను అనుమతించినట్లే. ప్రభుత్వ బ్యాంకుల్లో 49% విదేశీ పెట్టు బడులకు ఆటంకంగా ఉన్న నిబంధనలను తొలగించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ సాధారణ బీమా కంపెనీల ప్రయివేటీకరణకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ రంగాన్ని కాపాడుకోవడానికి పోరాటాలే శరణ్యమని బీమా ఉద్యోగులు భావిస్తున్నారు. 2005లో ఐడిబిఐ బ్యాంక్ ప్రభుత్వ బ్యాంక్‌గా మారినప్పటికీ నిర్వహణా లోపాల కారణంగా ఇబ్బందుల్లో పడింది. 2017లో ఆర్బీఐ... ఈ బ్యాంక్? కార్యకలాపాలపై కొన్ని పరిమితులు విధించింది. ఏడేళ్ల క్రితం.. ఎల్ఐసి ఈ బ్యాంక్‌లో 51% వాటాను కొను గోలు చేసినప్పుడు, అప్పుల్లో కూరుకుపోయిన బ్యాంకును ఎలా కొనుగోలు చేస్తుందనే దానిపై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే ఎల్ఐసి...బ్యాంక్ యాజమాన్యాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత... ఐడిబిఐ బ్యాంక్ గత మూడేళ్లలో రూ. 30 వేల కోట్ల నిర్వహణ లాభాన్ని నమోదు చేసింది. ఎనిమిదేళ్ల క్రితం వేల కోట్ల నష్టాలను చవిచూసిన ఐడిబిఐ తిరిగి లాభాల బాటలోకి రావడమే గాక నేడు రూ. నాలుగు లక్షల కోట్ల నిల్వ ఉంది. అనేక లిస్టెడ్? కంపెనీలు, ప్రైవేట్? బ్యాంకులు పేక మేడల్లా కుప్పకూలిపోతున్నప్పుడు, ఎల్?ఐసి మంచి నిర్వహణ పద్ధతుల ద్వారా లాభదాయక సంస్థగా మార్చగలిగింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఐడిబిఐలో 66%మేరకు పెట్టుబడుల ఉపసంహరణ చేయడానికి వేగవంతంగా చర్యలు తీసుకుంటోంది. ఐడిబిఐ అద్భుతమైన పురోగతి సాధిస్తున్న ప్రస్తుత తరుణంలో, దాన్ని పూర్తిగా ప్రయివేటు పరం చేయవలసిన అవసరం ఏమిటి ? దీన్ని ఎల్?ఐసి ఉద్యోగులతో పాటు ఐడిబిఐలోని అన్ని తరగతుల ఉద్యోగులు, అధికారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎల్ఐసిలో వ్యాపారం పెరిగినా, సిబ్బంది నియామకాలు చేపట్టడంలో విపరీతమైన జాప్యం జరుగుతోంది. మార్చి 31, 2017 నాటికి సంస్థలో 57,441 తరగతి 3,4 తరగతుల ఉద్యోగులుంటే.. డిసెంబర్?,2024 నాటికి ఆ సంఖ్య 42,632కి పడిపోయింది. అంటే 7 ఏళ్లలో దాదాపు 15 వేల మంది 3,4 తరగతుల ఉద్యోగులు తగ్గిపోయారు. వచ్చే కొన్నేళ్లలో వీరి సంఖ్య ఇంకా భారీగా తగ్గిపోయే అవకాశం ఉంది. కనుక తక్షణం నియామకాలు చేపట్టాలి. అప్పుడే సంస్థ, పాలసీ హోల్డర్ల ప్రయోజనాలు పరిరక్షించబడతాయి. యాజమాన్యం ఎల్ఐసి లో పారిశ్రామిక ప్రజాస్వామ్యాన్ని అమలు చేయట్లేదు.

## ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగుల సమ్మె.. కష్టమర్లకు ఇక్కట్లు





**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశంలోని ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగులు ఇవాళ దేశవ్యాప్తంగా సమ్మెకు దిగారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిూస్ అసోసియేషన్, బ్యాంక్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వంటి ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ సమ్మె జరుగుతోంది. చాలా కాలంగా పెండింగ్?లో ఉన్న తమ ముఖ్యమైన డిమాండ్లు నెరవేర్చాలని బ్యాంకు ఉద్యోగుల సంఘాలు ఈ సమ్మెకు దిగాయి. బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లలో ప్రధానంగా.. వారానికి ఐదు రోజుల పని దినాలు(ఇప్పటికే రెండు శనివారాలు సెలవులు ఉన్నాయి), వేతనాల పెంపు, పెన్షన్ సంస్కరణలు, 12వ ద్వైపాక్షిక వేతన ఒప్పందం పూర్తిగా అమలు కావాలన్నవి ఉన్నాయి. అంతేకాదు, ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణకు నిరసన, ఆటోమేషన్, ఔట్‌సోర్సింగ్ వల్ల ఉద్యోగాలపై వస్తున్న ముప్పు, పని ఒత్తిడి తగ్గించాలని, మెరుగైన వర్కింగ్ కండిషన్స్ ఉండాలని, సిబ్బంది కొరత తీర్చాలని, పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ లేదా మెరుగైన పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులు కోరుతున్నారు. ఈ డిమాండ్లపై జరిపిన చర్చలు ఫలించకపోవడంతో ఇవాళ ఒక రోజు దేశవ్యాప్త సమ్మెకు దిగారు. సమ్మె కారణంగా దేశంలోని దాదాపు అన్ని పబ్లిక్ సెక్టర్ బ్యాంకుల శాఖలు మూసివేశారు. దీంతో బ్యాంకు ఖాతా దార్లకు పరిమిత సేవలు మాత్రమే ఇవాళ అందుబాటులో ఉన్నాయి. ాువీలు, ఆన్?లైన్ బ్యాంకింగ్, ఖూ× వంటివి సాధారణంగా పనిచేస్తున్నాయి. కానీ కౌంటర్ సేవలు (క్యాష్ డిపాజిట్/విత్‌డ్రా, డ్రాఫ్ట్‌లు, లోన్ ప్రాసెసింగ్ మొదలైనవి) జరగడం లేదు. ఫలితంగా దేశ వ్యాప్తంగా బ్యాంకు ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వ్యాపారులు, పెన్షనర్లు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

## ప్రైవేట్ వైద్యుడి నిర్లక్ష్యం.. తల్లీ బిడ్డ మృతి




**అనంతపురం, పతాకం న్యూస్:** కదిరి పట్టణంలోని పద్మావతి హాస్పిటల్లో దారుణం చోటు చేసుకుంది. ప్రైవేటు ఆసుపత్రి వైద్యుడి నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలిగొంది. మంగళవారం మృతుల తరపు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ... శ్రీ సత్యసాయి జిల్లా ఎన్‌పి కుంట మండలం జౌకల గ్రామంకి చెందిన ఓబుల రెడ్డి, హరిణిలకు ఏడాది క్రితం వివాహమైంది. హరిణి ప్రసవం నిమిత్తం కదిరి పట్టణంలోని పద్మావతి హాస్పిటల్ కి వచ్చింది. ఆసుపత్రిలో చేరి వారం అయినా... డాక్టర్ మారుతి ప్రసాద్ సకాలంలో వైద్యం అందించకపోవడం వైద్యుడి నిర్లక్ష్యంతో తల్లి బిడ్డ మృతి చెందారని ఆరోపిస్తూ .... హాస్పిటల్ ఎదురుగా జాతీయ రహదారిపై బంధువులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే డాక్టర్ మారుతి ప్రసాద్‌ను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తల్లి బిడ్డ మృతికి కారణమైన పద్మావతి హాస్పిటల్ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ... బాధితులకు మద్దతుగా సిపిఐ పార్టీల నాయకులు ఆందోళన చేపట్టారు. కదిరి పట్టణంలోని పద్మావతి హాస్పిటల్‌లో వారం రోజుల క్రితం ప్రసవం కోసం హరిణి హాస్పిటల్లో చేరగా నార్మల్ డెలివరీ చేస్తానంటూ డాక్టర్ నిర్లక్ష్యం చేయడంతో తల్లి బిడ్డ మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. పద్మావతి హాస్పిటల్‌లో తరచూ ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని తెలిపారు. గతంలో కదిరి పట్టణం మూర్తిపల్లి కి చెందిన ఓ మహిళ చికిత్స నిమిత్తం రాగా బిడ్డ అబార్షన్ అయిపోయిందని, అప్పట్లో ఆ దంపతులు ఆందోళన వ్యక్తం చేశారు అని గుర్తు చేశారు. అలాగే కదిరి మండలం వీరేపల్లి పేట కి చెందిన ఓ మహిళ చికిత్స కోసం రాగా బిడ్డ మృతి చెందింది. దీంతో అప్పట్లో ఆందోళన చేయగా గుట్టు చప్పుడు కాకుండా పోలీసు స్టేషన్‌లో దుప్పటి పంచాయతీ చేసి కేసు నమోదు కాకుండా తప్పించుకున్నట్లు ఆరోపణలు వ్యక్తమయ్యాయి. పద్మావతి హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యం, ధనదాహానికి మరిన్ని ప్రాణాలు బలికాకుండా ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇలాంటి ఘటనలు పునరావృతవం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## పవర్ ప్లాంట్ పనులు నిలిపివేయాలంటూ ... ప్రజా సంఘాల ధర్నా




**పెద్దాపురం, పతాకం న్యూస్:** పెద్దాపురం మండలం ఆనూరు పంచాయతీ పరిధిలో గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా, ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా నిర్మించ తలపెట్టిన జిందాల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్డిఓ కార్యాలయం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏపీ ఆర్ సిఎస్, ఏఐఎఫ్టియు, పిడిఎస్యు , పి ఓ డబ్ల్యు లా ల ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నా సందర్భంగా ఆర్‌సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ .... జిందాల్ పవర్ ప్లాట్‌కు సంబంధించిన యాజమాన్యం తన ఆర్థిక రాజకీయ అండదండలతో ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా, పంచాయతీ తీర్మానం చేయకుండా దౌర్జన్యంగా పవర్ ప్లాంట్ నిర్మించడం అన్యాయమన్నారు. ఈ ఫ్యాక్టరీ వల్ల వాతావరణ కలుషితమై ప్రజలు తీవ్ర అనారోగ్యాలతో ఆసుపత్రుల పాలవుతారన్నారు. వెంటనే ప్రభుత్వం ఈ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

## భారత్- ఇయుల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారత్ – ఐరోపా సమాఖ్య(ఈయూ) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం(జనవరి 26న) ఈ ఒప్పందంపై సంతకాలు చేసినట్టు తెలిపారు. ప్రపంచ దేశాలు దీనిని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' అని చర్చించుకుంటున్నాయని మోదీ పేర్కొన్నారు. ఈ మేరకు గోవాలో ఇండియా ఎనర్జీ వీక్–2026ను మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం ఈ ట్రేడ్ డీల్ గురించి ఆయన వివరించారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. త్వరలోనే ప్రపంచంలో అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రంగా భారత్ అవతరించనుందని ప్రధాని నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. 2030 నాటికి చమురు, గ్యాస్ రంగంలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడే లక్ష్యమని స్పష్టం చేశారు. భారత్–యూరోపియన్ యూనియన్ (ఈయూ) వాణిజ్య ఒప్పందంతో తయారీ రంగంలో వృద్ధి సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దక్షిణ గోవా జిల్లాలోని బేతుల్ గ్రామం వేదికగా ఈ సదస్సు జరుగుతోంది. ఈ కార్యక్రమంలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరితోపాటు వివిధ దేశాలకు చెందిన మంత్రులు పాల్గొన్నారు. ఇంధన భద్రతను బలోపేతం చేయడం, పెట్టుబడులను సమీకరించడంతోపాటు డీ కార్బనైజేషన్ అమలు చేయడం కోసం ఆచరణాత్మకమైన అంశాలను ముందుకు తీసుకు వెళ్లడంపై ఈ ఇండియా ఎనర్జీ వీక్ సదస్సు దృష్టి సారిస్తోంది. అంతేకాకుండా.. ప్రపంచ ఇంధన దౌత్యంలో ఈ సదస్సు ద్వారా ప్రాధాన్యత పెరుగుతోందని భారత్ భావిస్తోంది. ఈ సదస్సుకు 120కి పైగా దేశాల నుంచి 75000 మందికిపైగా ఇంధన నిపుణులను ఇండియా ఎనర్జీ వీక్ ఆహ్వానించిన విషయం విదితమే. గతేడాది నిర్వహించిన ఇదే సదస్సులో 68 వేల మంది పాల్గొన్న సంగతి తెలిసిందే.

## బంగ్లాదేశ్ జైలు నుంచి 23 మంది భారత మత్స్యకారుల విడుదల..



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖకు చెందిన 9 మందితో సహా 23 మంది భారతీయ మత్స్యకారులు బంగ్లాదేశ్ జైలు నుంచి విడుదలయ్యారు. వీరు గత కొంతకాలంగా బాగేర్‌హాట్ జైలులో ఉంటున్నారు. జైలు అధికారులు ఈరోజు మధ్యాహ్నం 11 గంటలకు వారిని బంగ్లాదేశ్ కోస్ట్ గార్డుకు అప్పగించారు. ఈ సమయంలో భారత హైకమిషన్, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులు, పోలీసులు, జిల్లా పరిపాలన ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ హాజరయ్యారు. కోస్ట్ గార్డు సిబ్బంది విడుదలైన మత్స్యకారులను భారీ భద్రతతో మోంగ్లా సీపోర్ట్ కు తీసుకువెళ్లారు. గురువారం వారిని బంగ్లాదేశ్–భారత్ సముద్ర సరిహద్దు మధ్యలో ఇండియన్ కోస్ట్‌గార్డుకు అప్పగించే అవకాశం ఉంది. అక్టోబర్ 2025లో ఈ మత్స్యకారులు బంగ్లాదేశ్ జలాల్లోకి ప్రవేశించడంతో ఆ దేశ అధికారులు వారిని అరెస్టు చేశారు. రెండు దశల్లో ఈ మత్స్యకారులు అరెస్టయ్యారు. బంగ్లాదేశ్ నావికాదళం మొదటిసారి 14 మందిని, రెండోసారి 9 మంది మత్స్యకారులను అదుపులోకి తీసుకుంది. నాటి నుంచి వీరు బాగేర్‌హాట్ జైల్లో ఉన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేద్దాం: చంద్రబాబు

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన గ్రామీణ రహదారుల నెట్?వర్క్, లాజిస్టిక్స్, మార్కెట్, గ్లోబల్ కనెక్టివిటీపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ బృహత్తర ప్రణాళికల అమలుకు పూర్వోదయ, సాస్కి, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పోర్ట్ కనెక్టివిటీ, గోదాములు, కోల్డ్ చైన్ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పార్టీలో మార్పులు రావాలి: లోకేశ్

కోడికత్తి, కల్తీ మద్యానికి 'టీం 11' బ్రాండ్ అంబాసిడర్లు" అంటూ గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆర్సెలార్ మిట్టల్, గూగుల్ వంటి సంస్థలు ఏపీకి రావడానికి చంద్రబాబుపై ఉన్న నమ్మకమే కారణమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నామని లోకేశ్ తెలిపారు. "దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ.4 వేల పెన్షన్ ఇస్తున్నాం. వికలాంగులకు రూ.6 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు అందిస్తున్నాం. ఒక్క పెన్షన్లకే ఏడాదికి రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, 150 రోజుల్లో 16 వేల డీఎస్సీ పోస్టుల భర్తీ వంటివి పూర్తిచేశాం" అని వివరించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నేతలపై ఉందని లోకేశ్ సూచించారు. "మనం పనులు చేయడం ఎంత ముఖ్యమో, చేసిన పనులను చెప్పుకోవడం కూడా అంతే ముఖ్యం. పెన్షన్ చరిత్రను ప్రజలకు వివరించాలి. రూ.200 ఉన్న పెన్షన్‌ను మనమే రూ.2 వేలు చేసి, ఇప్పుడు రూ.4 వేలకు పెంచామని స్పష్టంగా చెప్పాలి" అని ఆయన పిలుపునిచ్చారు. పార్టీలో అంతర్గత సంస్కరణల ఆవశ్యకతను లోకేశ్ నొక్కిచెప్పారు. "పార్టీలో ప్రతి పదవికి టర్మ్ లిమిట్ ఉండాలి. ఒకే వ్యక్తి ఒక పదవిలో రెండుసార్లు కంటే ఎక్కువ ఉండకూడదు. వారు ప్రమోట్ కావాలి. ఒక సామాన్య గ్రామ పార్టీ అధ్యక్షుడు పొలిట్‌బ్యూరో వరకు ఎందుకు రాకూడదు? దీనికోసం పొలిట్‌బ్యూరోలో పోరాడాను" అని తెలిపారు. మహానాడులో తీర్మానించిన 'ఆరు శాసనాలను' పార్టీ నాయకులు తప్పనిసరిగా పాటించాలని లోకేశ్ ఆదేశించారు. కార్యకర్తలకే పెద్దపీట వేయాలని, యువతను రాజకీయాల్లోకి ప్రోత్సహించాలని, సామాజిక న్యాయం పాటించాలని, మహిళలను గౌరవించాలని సూచించారు. అన్నదాతకు అండగా నిలుస్తూ, తెలుగుజాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పార్టీ శ్రేణులకు ఉద్బోధించారు.

# అనకాపల్లిలో 'రోడ్డు భద్రత మారథాన్' పాల్గొన్న కలెక్టర్, కొణతాల




**అనకాపల్లి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రవాణా శాఖ, అనకాపల్లి డిపో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జనవరి 1, 2026 నుంచి జనవరి 31, 2026 వరకు జరుగు శిక్షణతో భద్రత సాంకేతిక ద్వారా పరివర్తనం నినాదంతో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు- 2026 నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అనకాపల్లి రింగ్ రోడ్ జంక్షన్ లో రోడ్డు భద్రత మారథాన్ నిర్వహించారు. మాజీ మంత్రి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ , అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు రోడ్డు భద్రత విషయంలో మన కుటుంబ బాధ్యత మన మీద ఉందని కుటుంబంలో ఏ ఒక్కరిని కోల్పోయిన తిరిగి తీసుకురాలేమని, 18 సంవత్సరాల నిండకుండా, లైసెన్స్ లేకుండా, ఆల్కహాల్ తీసుకొని వాహనం నడపరాదని, హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని, బాధ్యతగల పౌరునిగా వ్యవహరించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అందరితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రోడ్డు భద్రత మారథాన్ పచ్చ జెండా ఊపి ప్రారంభించి, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర , ఆర్డీవో, రవాణా శాఖ అధికారులు, పోలీస్ శాఖ, ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ అధికారులు, ఇతర అధికారులు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆంధ్రా యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ జట్టుకు మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపిక




**కొయ్యూరు, పతాకం న్యూస్:** మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని వెచ్చంగి ప్రియాంక ఆంధ్రా యూనివర్సిటీ సాఫ్ట్ బాల్ జట్టుకు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణంగా మారింది. ఆంధ్రా యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని గొన్న కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో నిర్వహించిన యూనివర్సిటీ టీమ్ సెలెక్షన్ ట్రయల్స్?లో మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఫిజికల్ డైరెక్టర్ ఎల్.రమణమ్మ మార్గదర్శకత్వంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీ.ఎస్సి. (ఫిజిక్స్)తృతీయ సంవత్సరం చదువుతున్న వెచ్చంగి ప్రియాంక తన ప్రతిభను చాటుతూ యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారు. ఆమె సాధించిన ఈ విజయం ఆమె క్రమశిక్షణ,నిరంతర కృషి,అంకితభావానికి నిదర్శనమని కళాశాల వర్గాలు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె.సుధ, వైస్ ప్రిన్సిపల్ వి.కే.టి.మహాలక్ష్మి,ఫిజికల్ డైరెక్టర్ ఎల్.రమణమ్మతో పాటు అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది ప్రియాంకను హృదయపూర్వకంగా అభినందించారు.భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని కళాశాల యాజమాన్యం ఆకాంక్షించింది.

# పూడిక తొలగించకపోవడంతో సాగునీరు అందక రైతుల గగ్గోలు



**పాయకరావుపేట, పతాకం న్యూస్:** చెంతనే ఉన్న తాండవ నదిలో పుష్కలంగా నీరు ఉన్నా పంట భూములకు నీరందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. కొన్నేళ్లుగా సాగునీటి కాలువలో పూడిక తొలగించకపోవడంతో సుమారు 300 ఎకరాలకు నీరు అందని దుస్థితి నెలకొంది. దీంతో మండలంలోని ఈదటం, పాల్మన్‌పేట, కందిపూడి తదితర గ్రామాల రైతులు వరి పంట వేయకుండా పొలాలను వదిలేశారు. కాలువలో పూడిక తీయించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. మండలంలోని తాండవ నది నుంచి ముఠా ఛానల్ కాలువ శ్రీరాంపురం వద్ద మెరక కాలువగా విడిపోయి ఈదటం, కందిపూడి, పాల్మన్‌పేట, కుమారపురం తదితర గ్రామాల్లోని సుమారు 1200 ఎకరాలకు సాగునీరందుతుంది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా సాగునీటి కాలువలో పూడికను తొలగించలేదని, కందిపూడి వద్ద కాలువపై ఉన్న మదుము పూర్తిగా దెబ్బ తిని తలుపులు ఊడిపోయాయని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ ఏడాది సాగు నీరు ముందుకు సాగక, రైతులు వరి పంట వేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సాగునీటి సంఘాలను ఏర్పాటు చేయడంతో కాలువలో పూడిక తీయిస్తారని, పంటలు పండుతాయని రైతులు ఆశపడ్డారు. కానీ రైతుల ఆశలు అడియాశలయ్యాయి. కాలువలో పూడిక తీయించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ రైతులు తిరిగారు. ఫలితం లేకపోవడంతో డెక్కన్ కంపెనీ సహకారం కోరారు. డెక్కన్ కంపెనీ యాజమాన్యం ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చి చివరి నిమిషంలో ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్ని, నారు మడులు సిద్ధం చేసి విత్తనాలను చల్లారు. తీరా నాట్లు వేసే సమయానికి కాలువలో నీరు ప్రవహించకపోవడంతో నాట్లు వేయకుండా వదిలేశారు. కొంతమంది రైతులు కాలువ ద్వారా సాగునీరు వస్తుందనే ఆశతో వర్షపు నీరుతో దమ్ములు పట్టారు. తీరా దమ్ములు పట్టిన తరువాత కాలువలో నీరు రాకపోవడంతో దమ్ములు ఎండిపోయాయి. దీంతో తీవ్రంగా నష్టపోయామని ఈదటం గ్రామానికి చెందిన రైతులు నేమాల సుబ్బారావు, సన్ని అప్పలరాజు, శోభన్?బాబు, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. మెర క కాలువ ద్వారా ఈదటం రెవెన్యూ పరిధిలోని పాయకరాని చెరువులోకి నీరు చేరుతుంది. అయితే ఈ ఏడాది చుక్క నీరు కూడా చెరువులోకి చేరలేదు. దీంతో చెరువు కింద ఆయకట్టు భూములకు సాగునీరందని పరిస్థితి ఏర్పడిందని ఈదటం గ్రామానికి చెందిన రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కాలువలో నీరు తక్కువగా ప్రవహిస్తుండడంతో అపరాలు చల్లడానికి కొంతమంది దుక్కులు దున్నారు. వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సాగునీటి కాలువలో పూడికను తీయించి సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# అనకాపల్లి ఉత్సవ్ కార్యక్రమాలను పరిశీలించిన అయ్యన్న పాత్రుడు.. స్వాగతం పలికిన కొణతాల



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లిలో మొట్టమొదటిసారిగా ప్రతిష్టాత్మకంగా అతి త్వరలో జరుగు 'అనకాపల్లి ఉత్సవ్' భాగంగా జరుగు కార్యక్రమాల్ని పరివేక్షించడానికి విచ్చేసిన నర్సీపట్నం శాసనసభ్యులు ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ను మాజీమంత్రి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ విజయ రెసిడెన్సిలో ఘనంగా స్వాగతం పలికి అతిథి సత్కారాలు చేశారు. అనంతరం అనకాపల్లి ఉత్సవం ప్రదేశాలు ఎన్టీఆర్ స్టేడియం, బెల్లం మార్కెట్ యార్డ్ లో జరుగు ఫ్లవర్ షో, ఎన్టీఆర్ గ్రౌండ్ జరుగు కార్యక్రమాలను పరిశీలించి ప్రదర్శన వివరాలు ను మీడియా నుంచి అడిగి తెలుసుకుని తగు సూచనలు చేశారు. అనంతరం అనకాపల్లి ఆర్టీవో ఆఫీస్ లో అనకాపల్లి ఉత్సవ్ ఏర్పాట్లు కోసం అధికారులతో సమీక్ష చేసి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# 29 నుంచి జరిగే అరకు ఉత్సవ్‌కు విస్తృత ఏర్పాట్లు



**అరకులోయ, పతాకం న్యూస్:** అరకు ఉత్సవ్‌కు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 29 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాన్ని సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న నేపథ్యంలో కలెక్టర్ దినేశ్‌కుమార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎస్పీ అమిత్‌బర్దార్, ఐటీడీఏ పీవో శ్రీపూజ, అధికారులతో కలిసి ఆయన ఉత్సవ్ ప్రధాన వేదిక అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరకులోయలో సుమారు మూడు గంటల సేపు గడిపే అవకాశం ఉందన్నారు. తుర్రాయిగుడ గ్రామానికి బదులు చొంపి గ్రామాన్ని సీఎం సందర్శించనున్నారని తెలిపారు. కొత్తవలసలోని ఐటీడీఏ హెచ్ఎన్‌టీసీ ఫాం సమీపంలో ప్రత్యేకంగా హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం కొత్తవలసను ఆనుకొని ఉన్న చొంపి గ్రామాన్ని సందర్శిస్తారని, గ్రామంలో హోం స్టేలను పరిశీలిస్తారన్నారు. అనంతరం గిరిజన మ్యూజియం, కాఫీ మ్యూజియాన్ని సందర్శించి కార్నివాల్ ర్యాలీని ప్రారంభిస్తారన్నారు. జిల్లాలో పలు అభివృద్ధికార్యక్రమాలకు సంబంధించి శంకుస్థాపన శిలాఫలకాలను సీఎం ఆవిష్కరిస్తారని చెప్పారు. అరకు ఉత్సవ్ ప్రధాన వేదిక అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని ఎక్స్‌కవేటర్లతో చదును చేస్తున్నారు. అలాగే పట్టణంలో పారిశుధ్య పనులను చురుగ్గా చేపడుతున్నారు. డీఎల్‌పీవో, ఎంపీడీవో ఆధ్వర్యంలో సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు.

# రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలి: సత్యనారాయణరావు




**అనకాపల్లి, పతాకం న్యూస్:** గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను వెంటనే నియమించి, వివరాలు అందజేయాలని జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు తెలిపారు. నెలవారీ సమావేశాలలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఆయన చాంబరులో ఎన్నికల జాబితా నవీకరణ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో 1529 పోలింగు బూతులు ఉన్నాయని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలన్నీ ప్రతి పోలింగు బూత్ నకు బూత్ లెవల్ ఏజెంటును నియమించి, ఏజెంటు వివరాలను అందించాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో మ్యాపింగు జరుగుతున్నదని, తదుపరి ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివ్యూ (ఎస్.ఐ.ఆర్) జరుగనున్నందున ఆ సమయానికి పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు విషయంలో బూత్ లెవల్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని, శుద్ధమైన ఓటర్లజాబితా తయారీలో సహకరించాలని కోరారు. జిల్లాలో మొత్తం 1298331 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 631486, స్త్రీలు 666816, ట్రాన్స్ జెండరు 29 ఉన్నారని తెలిపారు. 2025 డిశంబరు 29 తేదినుండి నేటివరకు జిల్లాలో 768 మందిని నూతన ఓటర్లుగా చేర్పించడం జరిగిందని తెలిపారు. ఫారం 6 సంబంధించి మొత్తం 1374 ధరఖాస్తులు రాగా 768 ఆమోదించడం జరిగిందని, 139 తిరస్కరించగా, 467 పెండింగులో ఉన్నాయని తెలిపారు. ప్రతి ధరఖాస్తుపై చర్యలు తీసుకొనుటకు 7 రోజుల సమయం పడుతుందన్నారు. జిల్లాలో ఫారం -6, ఫారం -7, ఫారం -8 సంబంధించి మొత్తం 3965 ధరఖాస్తుల రాగా వాటిలో 2449 ధరఖాస్తులు పరిష్కరించడం జరిగిందని, 226 తిరస్కరించడమైనదని, 1299 ధరఖాస్తులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. 2025 జనవరి 6వ తేది ఫైనల్ పబ్లికేషను నుండి ఇప్పటివరకు జిల్లాలో ఫారం-6, ఫారం-7, ఫారం-8 సంబంధించి మొత్తం 24489 ధరఖాస్తుల రాగా వాటిలో 19256 ధరఖాస్తులు పరిష్కరించడం జరిగిందని, 3944 తిరస్కరించడమైనదని,1299 ధరఖాస్తులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. 7542 మందిని నూతన ఓటర్లుగా చేర్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెక్టను డి.టి. షేక్ ముజీర్, ఆమ్ ఆద్మీ పార్టి ప్రతినిధి కె. హరినాథ్ బాబు, బి.జె.పి. పార్టీ ప్రతినిధి వి. రమేష్, వైఎస్ఆర్సిపి పార్టీ ప్రతినిధి జె. రమేష్, జనసేన పార్టీ ప్రతినిధి డి. వేణుగోపాల కిరణ్, భారతజాతీయకాంగ్రెస్ పార్టీ ప్రతినిధి జి.గున్నబాబు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె.. గొలుగొండ ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీల నోటీసు




**గొలుగొండ, పతాకం న్యూస్:** అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఫిబ్రవరి 12న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో భాగంగా గొలుగొండ ఐసిడిఎస్ కార్యాలయంలో ఐసిడిఎస్ అధికారి కిరణ్ కి యూనియన్ ప్రతినిధులు సమ్మె నోటీసును అందజేశారు. 17 పాయింట్ల జాతీయ డిమాండ్ల చార్టర్‌తో పాటు స్థానిక సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ప్రధానంగా నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయాలని, అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించి వారికి ట్రేడ్ యూనియన్ హక్కులు కల్పించాలని కోరారు. అంగన్వాడీ వర్కర్లను గ్రేడ్-3 గా, హెల్పర్లను గ్రేడ్-4 ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు, ఐఎల్సి సిఫార్సుల ప్రకారం నెలకు 26 వేల రూపాయల కనీస వేతనం, 10 వేల రూపాయల పెన్షన్, పీఎఫ్ మరియు ఈఎస్ఐ వంటి సామాజిక భద్రత సౌకర్యాలను కల్పించాలని పట్టుబట్టారు.సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి రిటైర్ అయిన అంగన్వాడీలకు గ్రాట్యుటీ వర్తింపజేయాలని, ఐసిడిఎస్ వ్యవస్థను ఏ రూపంలోనూ ప్రైవేటీకరించకూడదని వారు స్పష్టం చేశారు. ఐసిడిఎస్ వ్యవస్థకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంలో సరైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన ఆహారం మరియు ఈసీసీఈ హక్కు కోసం చట్టం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ నాయకులు ఎమ్.మంగ, భవాని,సత్య,వెంకయ్యమ్మ, చిన్నారి తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# దుర్గమ్మ జాతర తీర్ధ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గుడివాడ అమర్‌నాథ్



**చోడవరం, పతాకం న్యూస్ :** చోడవరం మండలం అంకుపాలెం గ్రామంలో దుర్గమ్మ తీర్ధ మహోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు, అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు, చోడవరం నియోజవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్నాథ్ పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరుగుతున్న దుర్గమ్మ జాతర తీర్ధ మహోత్సవం లో రాష్ట్ర స్థాయి కబాడీ పోటీలు ప్రతి సంవత్సరం నిర్వహించడం ఆనవాయితీ వస్తుంది. వీటితో పాటు ఎడ్ల పందెలు పోటీలు కూడా ఘనంగా నిర్వహిస్తారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చందు రాంబాబు, దుర్గాదేవి ఆలయ కమిటీ సభ్యులు, చోడవరం మండల పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# 29న పరవాడలో అక్కులు తాత తీర్ధం

**పరవాడ, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడలో భీష్మ ఏకాదశి పురస్కరించుకొని ఈనెల 29 గురువారం కీర్తిశేషులు చుక్క అక్కులు తాత తీర్థం సీతారామ కళ్యాణ మండపం ఆవరణలో సాయంత్రం నిర్వహిస్తున్నట్లు మండపం అధినేత గండి నమోబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు సాయంత్రం 5 గంటల నుండి చిడతలు, గరిడీలు, చిటికెల భజనలు, సప్త స్వర భక్తి గీతాంజలి వారిచే సంకీర్తనలు, ప్రసన్న కూచిపూడి నాట్య కళాశాల వారిచే నృత్య ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు, భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు నమో బాబు తెలిపారు. కావున భక్తులు, ప్రజలు, చుక్క వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్ధ ప్రసాదాల స్వీకరించాలని కోరారు.

## ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలకు
# తగ్గిన రైలు ప్రయాణ భారం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలకు రైలు ప్రయాణభారం తగ్గింది. రైల్వేశాఖ ఇచ్ఛాపురం స్టేషన్‌లో నాలుగు రైళ్లకు, సోంపేట స్టేషన్‌లో మూడు రైళ్లకు హాల్టింగ్ కల్పించింది. చిన్న స్టేషన్‌గా ఉన్న బారువలోనూ ఇంటర్‌సిటీ సూపర్ ఫాస్ట్ రైలుకు హాల్టింగ్ లభించింది. ఇచ్ఛాపురం, సోంపేట రైల్వేస్టేషన్లలో రాధికాపూర్ నుంచి ఎస్ఎంవీటీ బెంగళూరు అమృత్‌భారత్, న్యూజల్పయ్‌గురి నుంచి నాగర్‌కోయిల్‌కు వెళ్లే అమృత్‌భారత్ వీక్లీ రైలు, న్యూజయల్ప్ గురి నుంచి తిరుచ్చిరాపల్లికి వెళ్లే అమృత్‌భారత్ వీక్లీ రైలుకు హాల్టింగ్ ఇచ్చారు. ఇచ్ఛాపురంలో అదనంగా అహ్మదాబాద్ పూరి ఎక్స్‌ప్రెస్‌కు సైతం హాల్టింగ్ కల్పించారు. దీంతో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రయాణికులకు కొంత భారం తగ్గింది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మత్స్యకారులు, పలువురు ఉపాధి నిమిత్తం ఎక్కువగా వలస వెళ్తుంటారు. రైల్వే సదుపాయం సరిగా లేక ప్రయాణ సమయంలో ఇబ్బందులు పడేవారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో జూనాఘర్ రోడ్డు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ మెయిల్, విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, విశాఖ ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్, చర్లపల్లి స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, అహ్మదాబాద్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, పూరీ–తిరుపతి ఎక్స్‌ప్రెస్, హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్, ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌తోపాటు ఇతర ప్యాసింజర్ సర్వీసులు 19 వరకూ ఆగుతున్నాయి. ఇప్పుడు ఇచ్ఛాపురంలో అదనంగా నాలుగు సర్వీసులు అందుబాటులో రానున్నాయి. ఇచ్ఛాపురంతో పోల్చితే సోంపేట రైల్వేస్టేషన్‌లో మంగుళూరు సెంట్రల్ వివేక్ ఎక్స్‌ప్రెస్, తెంబరం అంత్యోదయ ఎక్స్‌ప్రెస్, గాంధీగామ్ వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ గరీభ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లు అదనంగా నడుస్తున్నాయి. తాజాగా మూడు ప్రత్యేక రైళ్లకు హాల్టింగ్? కల్పించడంతో ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** హరిపురంలో ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు, ఒత్తిడి లేని చదువు లభిస్తుందని విద్యార్థులు, ఉపా ధ్యాయులు ర్యాలీ చేపట్టారు. హరిపురంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎస్.విజయ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి మనబడిని మనం కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బైరిశెట్టి గున్నయ్య, పుల్లా వాసు, విశ్వనాథం, కోదండరావు, కన్నయ్య, చంద్రశేఖర్, మట్ట ఖగేశ్వరరావు, సోమనాధం పాల్గొన్నారు.

## శ్రీ పోతురాజు బాబు స్వామి ఆలయంలో త్రాగునీటి బోరు



**రావికమతం, పతాకం న్యూస్:** మండలంలో కొత్తకోట గ్రామంలో ఇదే గ్రామానికి చెందిన తంటపురెడ్డి వారి కుటుంబీకుల ఆధ్వర్యంలో స్థానిక మర్రివలస వెళ్లే రహదారి సమీపన నిర్మాణం కాబడుతున్న శ్రీ పోతురాజు బాబు స్వామి ఆలయ ప్రాంగణంలో గుమ్మడు రమేష్, నాని బ్రదర్స్ అమృత బోర్వెల్స్ వారి సహకారంతో దేవాలయ ప్రాంగణంలో బోరకు డ్రిల్లింగ్ చేసే మిషనరీతో పనులు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ బ్యాంక్ పూర్వ అధ్యక్షులు గుమ్మడు సత్యదేవ్, గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, ఉపసర్పంచ్ పందల దేవ, మాజీ ఉపసర్పంచ్ కేదార్శెట్టి గున్నాజి, శివాలయం పాలకమండలి పూర్వ చైర్మన్ గుమ్మడు దొరబాబు, శ్రీరెడ్డి, భీమరాతి వెంకట్, భీమ రాతి శ్రీను, వేమవరపు రమణ, గొర్లి కృపారావు, తండపురెడ్డి అప్పారావు, రాజు . .వారి కుటుంబీకుల కుల పూజారి పోతురాజు బాబువారు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దివాకర్ రావు సేవకు సత్కారం

**పరవాడ, పతాకం న్యూస్:** 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా అనకాపల్లి జిల్లా, పరవాడ మండల విద్యాశాఖ అధికారి ఎం.దివాకర్ రావు సేవలను కొనియాడుతూ జిల్లా కలెక్టర్ గణతంత్ర వేడుకల్లో భాగంగా ప్రశంసా పత్రంతో సత్కరించారు.

# గొప్పూరులో రేషన్ స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని గిరిజనుల ఆందోళన




**మాడుగుల, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం శంకరం పంచాయతీ పరిధిలోని గెడ్డ అవతల నివసిస్తున్న ఏడు గ్రామాల గిరిజనులు రేషన్ సమస్యలపై మంగళవారం కదం తొక్కారు. గొప్పూరు గ్రామంలో వెంటనే రేషన్ స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లానేత డి.వెంకన్న,గిరిజన సంఘం కార్యదర్శి నరసింహమూర్తి మాట్లాడుతూ కొత్తవలస,వెలగలపాడు, గొప్పూరు, తాడివలస,రాజంపేట, రాయపాలెం, మామిడిపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు రేషన్ కోసం ప్రమాదకరమైన గెడ్డలు దాటి కృష్ణంపాలెం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇంటింటికీ రేషన్ అందేదని,కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ కిలోమీటర్ల దూరం నడవాల్సి రావడం గిరిజనులకు శాపంగా మారిందని మండిపడ్డారు. రవాణా సౌకర్యం లేక వృద్ధులు,పాఠశాలలు, అంగన్‌వాడీలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని,ప్రభుత్వం వెంటనే స్పందించి గొప్పూరులో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మహేష్ బాబు, సోలం మంగ,చినమ్ములు, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బొబ్బిలి సమీపంలో
# గజరాజుల స్వైరవిహారం



**బొబ్బిలి, పతాకం న్యూస్:** విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఏనుగులు స్వైరవిహారం చేస్తున్నాయి. దిబ్బగుడ్డివలస, రాజుపేట, సీతయ్యపేట గ్రామాల పరిధిలో సంచరిస్తున్నాయి. పిల్ల ఏనుగులతో కలిపి 8 ఏనుగులు పొరుగున ఉన్న పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం, మక్కువ మండలాల సరిహద్దు నుంచి బొబ్బిలి పట్టణ సమీపానికి వచ్చేశాయి. మూడు రోజులుగా మొక్కజొన్న పంటను, రైతులు కళ్లాల్లో నిల్వచేసిన ధాన్యం బస్తాలను ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులకు ఆహారం దొరకకపోవడం, విశాఖ–రాయపూర్? వెళ్లే రైళ్ల రాకపోకల శబ్దాలతో ఏనుగులు ఇక్కడి నుంచి కదలడం లేదని అటవీ అధికారులు తెలిపారు.

## సందడిగా అమ్మవార్ల తీర్థాలు



**వేపాడ, పతాకం న్యూస్:** మండలంలోని జాకేరు గ్రామంలో పైడమ్మ, చిన్నమ్మపేరంటాలు, వీరాంజనేయస్వామి తీర్థ మహోత్సవాలు సందడిగా జరిగాయి. రెండు రోజు ఉత్తరాంధ్ర స్థాయిలో నిర్వ హించిన సంగిడీరాళ్ల పోటీలు ఉత్కంఠగా సాగాయి. మధ్యాహ్నం గుర్రపు పందేలు నిర్వహించారు. ఈ పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బల్లంకి గ్రామంలో మరిడిమాంబ జాతర వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన బండ్ల వేషాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## ఘనంగా శ్రీ పరదేశమ్మ తల్లి పండుగ..



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి మండలం రామాపురం పరిధిలో ఉన్న బిఆర్టి కాలనీలో మంగళవారం శ్రీ పరదేశిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బండి రాధిక, గ్రామ ప్రజలు, పెద్దలు, మహిళలు, యువత అందరి ఈ పండుగ అంబరాన్నంటే సంబరంగా జరిగింది. తెల్లవారుజామునించే భక్తులందరూ తరలివచ్చి అమ్మవారికి పసుపు, కుంకాలు, చీరలు సమర్పించి ముక్కులు తీర్చుకున్నారు . అనంతరం బండి రాధిక ఇంటి దగ్గర నుండి అమ్మవారికి పసుపు, కుంకుమలు చీర, సారె, నగలు తీసుకువచ్చారు అలంకరణ నిమిత్తం. మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం సంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా శ్రీ పరదేశమ్మ భజన బృందం వారి భజన, శ్రీ పరదేశమ్మ బృందం వారి కోలాటం వంటి కార్యక్రమాలు, గ్రామం మొత్తం విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేశారు

## నేడు రాజాం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత..

**బుచ్చయ్యపేట, పతాకం న్యూస్:** మండలంలోని రాజాం సబ్ స్టేషన్లోని 11 కేవి పెదమదీన పీడర్లో ఆర్డిఎస్ఎస్ విద్యుత్ మరమ్మత్తులు కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయునన్నట్లు నర్సీపట్నం ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్. రామకృష్ణ తెలిపారు. పెదమదీన, చినమదీన, గున్నెంపూడి, అయితంపూడి, కేపీ అగ్రహారం, కొండపాలెం, పైడంపేట గ్రామాలలో ఉ.9:00 నుండి మ.2గం. వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయునున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు

## కనీస వసతులు లేని
# దోనుగుమ్ముల జలపాతం



**గూడెంకొత్తవీధి, పతాకం న్యూస్:** మండలంలోని దోనుగుమ్ముల జలపాతం కనీస అభివృద్ధికి నోచుకోకపోవడం వల్ల సందర్శకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాలిబాట మినహా రహదారి సౌకర్యం లేని ఈ జలపాతాన్ని సెలవు రోజుల్లో వందల సంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తుంటారు. జలపాతం వద్ద కనీస సదుపాయాలు కల్పిస్తే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. గత రెండేళ్లుగా సందర్శకుల సంఖ్య క్రమంగా పెరిగింది. ప్రస్తుతం శని, ఆది, సోమవారాల్లో వందల సంఖ్యలో పర్యాటకులు జలపాతాన్ని సందర్శిస్తున్నారు. కార్తీక మాసంలో వేల సంఖ్యలో పర్యాటకులు జలపాతాన్ని సందర్శిస్తుంటారు. చింతపల్లి– సీలేరు ప్రధాన రహదారిలో జీకేవీధి తరువాత వచ్చే సంపంగిగొంది గ్రామం నుంచి రెండు కిలోమీటర్లు కాలినడక వెళితే దోనుగుమ్ముల జలపాతం వస్తుంది. గతంలో ఈ జలపాతానికి వెళ్లేందుకు కాఫీ తోట మధ్యలో నుంచి కాలిబాటపై నడిచి వెళ్లాల్సిన పరిస్థితి వుండేది. పర్యాటకులు అధిక సంఖ్యలో జలపాతాన్ని సందర్శిస్తుండడంతో దోనుగుమ్ముల గ్రామానికి చెందిన గిరిజనులు వాహనాలు వెళ్లే మార్గాన్ని శ్రమదానంతో నిర్మించారు. దీంతో ప్రస్తుతం జలపాతం సమీపం వరకు ద్విచక్ర వాహనాలు, జీపులు, కార్లు కూడా వెళుతున్నాయి. అరకిలోమీటరు దూరంలో వాహనాలు నిలిపివేసి జలపాతం వద్దకు నడిచి వెళ్లాలి. దోనుగుమ్ముల జలపాతం సుమారు రెండు వందల అడుగుల ఎత్తులో నుంచి దిగువకు నీటి ప్రవాహం జరుగుతోంది. శ్వేత వర్ణంలో జలధార వేగంగా కిందకు పడుతుంది. జలపాతం నీటి ప్రవాహం మూడు స్టెప్స్‌ల్లో జరుగుతుంది. నీటి ప్రవాహం జరుగుతున్న బండరాయి మూడు స్టెప్స్ కలిగివుంది. దీంతో జలపాతం చూడడానికి ఆకర్షణీయంగా కనిపిస్తుంది. దీంతో పర్యాటకులు ఈ జలపాతంలో జలకాలాడేందుకు ఆసక్తి చూపుతున్నారు. జలపాతం వద్ద పర్యాటక శాఖగాని, ఐటీడీఏ గాని కనీస సదుపాయాలు కల్పిస్తే పర్యాటకుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముంది. ప్రస్తుతం గ్రామస్థులు నిర్వహించిన మట్టిరోడ్డును కనీసం మెటల్‌రోడ్డుగానైనా నిర్మిస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయి. పర్యాటకులు సందర్శించడానికి అనువుగా కొత్తపల్లి జలపాతం వద్ద మాదిరిగా మెట్లు ఏర్పాటు చేయాలి. జలపాతం వద్ద మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటుచేయాలి. తాగేందుకు మంచినీటి సౌకర్యం కల్పించాలి. సీజన్‌లో పెద్ద సంఖ్యలో పర్యాటకులు వనభోజనాలు చేసేందుకు జలపాతానికి వస్తుండడంతో కమ్యూనిటీ భవనం ఒకటి నిర్మిస్తే సందర్శకులకు ఉపయోగకరంగా వుంటుంది.

## అక్కిరెడ్డిపాలెంలో పశు వైద్య శిబిరం



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెం గ్రామపంచాయతీ రైతు సేవ కేంద్రం వద్ద మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ప్రోత్సాహంతో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు రైతులు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వైద్యంతో పాటు నట్ట నివారణ మందులు, రోగ నిరోధక వ్యాక్సిన్లు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాలాపు శాంతి సూరి అప్పారావు, డాక్టర్ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ జి. వి.శ్యామల, ఇతర వెటర్నరీ డాక్టర్స్, రైతులు పాల్గొన్నారు.

## కలెక్టర్ చేతుల మీదుగా రికార్డ్ అసిస్టెంట్ సంతోష్ కుమార్‌కు అవార్డు

**బుచ్చయ్యపేట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలంలో వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల విధులలో అత్యంత ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు దేశ 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కళాశాల రికార్డ్ అసిస్టెంట్ వై సంతోష్ కుమార్ జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జి. చిన్నారావు, కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు.

## బ్రెయిన్ డెడ్ అయినా ఐదుగురికి ప్రాణదానం




**గుంటూరు, పతాకం న్యూస్:** బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి నుంచి పలు అవయవాలను దానం చేసి ఐదుగురి ప్రాణాలు కాపాడిన ఘటన గుంటూరులో సోమవారం జరిగింది. గుంటూరు జిల్లా నిడుముక్కల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పెరుగు అమర్ బాబు(22) తీవ్రంగా గాయపడటంతో బ్రెయిన్ డెడ్ అయింది. ఈ సందర్భంగా జీవన్‌దాన్ కోఆర్డినేటర్లు రోగి కుటుంబ సభ్యులకు అవయవ దానం ప్రాముఖ్యతను వివరించగా, కుటుంబ సభ్యులు అవయవ దానం చేసేందుకు ముందుకు వచ్చారు. తెనాలి మండలం పినపాడు గ్రామానికి చెందిన పెరుగు అమర్? బాబు, నిడుముక్కల శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు సోమవారం ఆయనను బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. దీంతో, హాస్పిటల్ నుంచి గన్నవరం ఎయిర్ పోర్ట్ వరకు ప్రత్యేక గ్రీన్ ఛానల్ ద్వారా గుండె తిరుపతికి తరలించారు. ఇతర అవయవాలను ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లోనే మరో ఐదుగురికి మార్పిడి చేశారు. తమ కుమారుడు మృతి చెందినా ఐదుగురు ప్రాణాలను కాపాడాడని, వారిలో తమ కుమారుడిని చూసుకుంటామని అమర్ తల్లి కోటేశ్వరమ్మ తెలిపారు. కోటేశ్వరమ్మను మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే గల్లా మాధవి అభినందించారు.

## బిర్యానీలో నిద్రమాత్రలు కలిపి భర్తను హత్య చేసిన భార్య, ప్రియుడు



**గుంటూరు, పతాకం న్యూస్:**బిర్యానీలో నిద్రమాత్రల పౌడరు కలిపి భర్తను ప్రియుడితో కలిసి హత్య చేసిన కేసులో ముగ్గుర్ని దుగ్గిరాల పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను గుంటూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి వకుల్ జిందాల్ వెల్లడించారు. దుగ్గిరాల మండలం చిలుమూరు గ్రామానికి చెందిన లోకం శివనాగరాజు (48)కు లక్ష్మీ మాధురితో 2008లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. శివనాగరాజుకు ఉల్లిపాయల వ్యాపారంలో నష్టం రావడంతో ఆన్‌లైన్‌లో షేర్ల వ్యాపారానికి దిగాడు. అందులోనూ నష్టం రావడంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. ఇదిలా ఉండగా భార్య లక్ష్మీ మాధురి దుగ్గిరాల మాంటిసోరి స్కూల్లో టీచర్‌గా పనిచేస్తుండగా కొండవీటి గోపి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతన్ని ఆమె తన భర్తకు కూడా గోపీని పరిచయం చేశారు. ఆమెకు గోపీతో వివాహేతర సంబంధం ఏర్పడడంతో శివనాగరాజును అడ్డు తొలగించుకునేందుకు నిర్ణయించుకున్నారు. ఈనెల 18న శివనాగరాజుకు లకీమాధురి బిర్యానీలో నిద్రమాత్రల పొడి కలిపి మత్తులోకి వెళ్లిన తర్వాత గోపి, అతని స్నేహితుడు ఆర్ఎంపి డాక్టర్ అయిన కంభంపాటి సురేష్‌ను పిలిపించి ముగ్గురూ కలిసి శివనాగరాజును దిండుతో అదిమి చంపారు. గ్యాస్ ట్రబుల్ వల్ల మరణించినట్లు నమ్మించేందుకు భార్య యత్నించినా పోస్టుమార్టం నివేదికలో మృతుడి శరీరంపై కమిలిన గాయాలు, పక్కటెముకలు విరిగినట్లు ఉండడంతో పోలీసులు దర్యాప్తు చేపగా హత్యగా తేలింది. తనను శారీరకంగా, మానసికంగా హింసిస్తూ, తనకు ఉన్న వివాహేతర సంబంధం ఉందని తెలిసి మరింత వేధిస్తుండడంతో హత్య చేసినట్లు ఆమె పోలీసుల విచారణలో అంగీకరించారు. డిఎస్‌పి మురళీకృష్ణ పర్యవేక్షణలో సిఐ ఎ.వి.బ్రహ్మం ఆధ్వర్యంలో కేసును ఎస్ఐ వెంకటరవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు



**కోనసీమ, పతాకం న్యూస్:**గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో ఏ.రాజు అన్నారు. మండలంలోని గుమ్మిలేరులో మంగళవారం ఆయన పచ్చదనం, పరిశుభ్రత కోసం చెత్త సంపద కేంద్రం, గ్రామ చెరువులు, రోడ్ల పరిసరాలు, డ్రైనేజ్ వ్యవస్థలోని సిల్ట్ తొలగింపులను మంగళవారం క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే స్థానిక సిబ్బంది నుంచి పారిశుధ్య నిర్వహణపై వివరాలు సేకరించి గ్రామంలో క్షేత్రస్థాయిలో పారునీరు డ్రైనేజీలలో సిల్ట్ తొలగింపు విధానాన్ని ప్రత్యేకంగా తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. మరి ముఖ్యంగా చెత్త సంపద కేంద్రాల ద్వారా పంచాయతీకి ఆదాయం వనరుగా మార్చుకోవాలని ఆయన సూచించారు. అలాగే జీవవైవిధ్యానికి ఆలంబనగా నిలిచే వివిధ రకాలకు చెందిన మొక్కలను గ్రామ పరిధిలో నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అదేవిధంగా పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా డ్రైనేజీలను అనునిత్యం శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే డస్ట్‌బిన్లలో తడి, పొడి చెత్త వేరువేరుగా గ్రామస్థులు తప్పకుండా సేకరించి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. ఆ విధంగా చేయడం వలన పారిశుధ్య సిబ్బందికి ఎస్? డబ్ల్యూ సి షెడ్ల నిర్వహణకు సహకారం అందించిన వారవుతారని ఆయన అన్నారు. ఇందుకోసం ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బందిని నియమించినట్లు కార్యదర్శి, ఆయనకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఈదల వీర్రాజు, కార్యదర్శి కె.రాకేష్ కుమార్, సచివాలయ, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# అలల ఉద్ధృతికి అడ్డుకట్ట ..

## జియోట్యూబ్ టెక్నాలజీతో రక్షణ గోడ



**నరసాపురం, పతాకం న్యూస్:** ఒకప్పుడు అక్కడొక ఇల్లు, ఇక్కడో గుడి ఉండేవి. తీరం పొడవునా కొబ్బరి, సర్వి తోటలు విస్తారంగా ఉండేవి. అవన్నీ కళ్లెదుటే కడలి గర్భంలో కలిసిపోయాయి. దీంతో లంక ప్రాంతాల వాసులు ఖాళీ చేసి వేరే ప్రాంతాలకు వెళ్లిపోతున్న పరిస్థితి. కిలోమీటర్ల మేర తీరం వెంబడి రక్షణగోడ కట్టాలంటే వందల కోట్ల రూపాయల ఖర్చు కావటంతో దాదాపు అందరూ ఆశలు వదలుకున్నారు. అలల ఉద్ధృతికి అడ్డుకట్ట వేసేందుకు ప్రయోగాత్మకంగా కిలోమీటరు మేర జియోట్యూబ్ టెక్నాలజీతో రక్షణ గోడ నిర్మించారు. దీని ఫలితాలను బట్టి విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పరిధిలో చినమైనవానిలంక, బియ్యపుతిప్ప, పెదమైనవానిలంక గ్రామాల్లో తీరం వెంబడి ఉన్న గ్రామాలు, తోటలు సముద్రం కోతతో కాల గర్భంలో కలిసిపోయాయి. ఆయా ప్రాంతాల్లో సముద్రం క్రమేపీ ముందుకొస్తుండటంతో ఊళ్లకు ఊళ్లే సముద్ర గర్భంలో కలిసిపోతున్నాయి. తీరప్రాంతవాసుల గుండె కోతకు కారణమవుతున్న అలల ఉద్ధృతికి అడ్డుకట్ట వేసేందుకు ఈ ప్రాంతంలో ప్రయోగాత్మకంగా కిలోమీటరు మేర జియోట్యూబ్ టెక్నాలజీతో రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు. తీర ప్రాంతంలో కోత నివారణకు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లో గతంలోనే జియోట్యూబ్ టెక్నాలజీని వినియోగించారు. ప్రస్తుతం అదే సాంకేతికతను ఉపయోగిస్తున్నారు.

పెదమైనవానిలంకలో కోతను నివారించేందుకు 2022లో కేంద్రఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదేశాలతో ఈ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. డెలైట్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు 13.50 కోట్లు మంజూరు చేయగా గత వైఎస్సార్సీపీ సర్కారు నిర్లక్ష్యంతో పనులు ప్రారంభం కాలేదు. మద్రాస్? ఐఐటీ నిపుణుల నమూనా, సూచనల ఆధారంగా గతేడాది మేలో పెదమైనవానిలంకలో పైలట్ ప్రాజెక్టుగా కిలోమీటరు మేర రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్టారు. పుణెకు చెందిన గార్వారి సంస్థ ఈ పనులు ప్రారంభించగా ఫిబ్రవరి నాటికి 73 శాతం పూర్తవుతాయని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు.

2004లో సునామీ తర్వాత చినలంక, పాత బియ్యపుతిప్ప గ్రామాలు దాదాపుగా సముద్రంలో కలిసిపోయాయి. పీఎం లంక, కేపీపాలెం సౌత్?లోనూ తీరం తరగిపోతోంది. బంగాళాఖాతంలో తుపానులు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీరం వెంబడి కోట్ల విలువైన సర్వి, కొబ్బరి తోటలు కడలిలో కలిసిపోతున్నాయి. మూడేళ్ల కిందట సముద్రం పీఎం లంకకు 3 కిలోమీటర్ల దూరంలో ఉండేది. ఇప్పుడు కేవలం కిలోమీటరు దూరంలోకి వచ్చేసింది. జిల్లాలో 19 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉండగా కోత సమస్య తీవ్రంగా ఉంది.

దీంతో పైలట్ ప్రాజెక్టుగా కిలోమీటరు మేర నిర్మాణం చేపట్టారు. దీని ఫలితాల ఆధారంగా మిగిలిన చోట్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. 6 దశలుగా చేపడుతున్న ప్రక్రియలో జియో టెక్స్‌టైల్ ఫ్యాబ్రిక్‌తో తయారు చేసిన ట్యూబ్‌లను ఇసుకతో నింపి నిర్దేశిత పొడవు, వ్యాసంతో తీరప్రాంతంలో గోడలా అమర్చుతున్నారు. దీనికి ఇరువైపులా పాలిప్రొపైలిన్‌జియో సింథటిక్ తాడుతో చేసిన గాబియన్ బాక్స్‌లో గ్రానైట్ రాళ్లను నింపి వాటి మధ్య ఖాళీని ఇసుక సంచులతో పూడ్చుతున్నారు. తరువాత గాబియన్ బాక్సులపై, జియో టెక్స్‌టైల్ లేయర్, రాతిపొరతో పాటు ముర్రుమ్ లేయర్ వేస్తున్నారు.

# ముంబై వైపుగా సాగుతున్న రైతుల లాంగ్ మార్చ్!

**నాసిక్, పతాకం న్యూస్:** బిజెపి నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక, కార్పొరేట్? అనుకూల విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, ఎఐకెఎస్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలో జరుగుతున్న లాంగ్‌మార్చ్ ముంబయి వైపుగా ఉవ్వెత్తున సాగుతోంది. నాసిక్‌లో ప్రారంభమైన పాదయాత్రలో పదివేలకు పైగా పాల్గొంటున్నారు. ఎర్రజెండాలు చేతబూని, నినాదాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. లాంగ్‌మార్చ్ ముంబయి వైపుగా కదలింది. మరోవైపు ఈ పాదయాత్ర నాయకులతో మహారాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరపడం ప్రారంభించింది. అయితే ఈ సంప్రదింపులను నాయకులు తిరస్కరించారు. ముఖ్యమంత్రి స్వయంగా ఎఐకెఎస్ ప్రతినిధి బృందంతో సమావేశమై, పాదయాత్ర డిమాండ్లను అంగీకరించే వరకూ పాదయాత్ర జరుగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ప్రజాసమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో నాసిక్‌లో సిపిఎం మహా పాదయాత్రను ప్రారంభించింది. నాసిక్ జిల్లాల్లోని అన్ని తాలుకాలకు చెందిన మహిళలు, పురుషులు, వృద్ధులు, యువకులు ఈ లాంగ్‌మార్చ్‌లో భాగస్వామ్యమయ్యారు. ఈ నెల 21న పాల్ఘడ్‌లో 50 వేల మందితో సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన మార్చ్ విజయవంతమైన నేపథ్యంలో నాసిక్ నుంచి రెండో మార్చ్ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. పాల్ఘడ్ పోరాటం వలెనే, నాసిక్ పోరాటం కూడా రెండు ప్రధాన సమస్యలపై జరుగుతోందన్నారు. అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ),పెసా చట్టం, సాగునీటి పథకాలు, జిల్లా పరిషత్? పాఠశాలల్లో వేలాది ఖాళీల భర్తీ మొదలైన వాటిపై గతంలో ఇచ్చిన అనేక హామీలను అమలు చేయకపోవడంపై పోరాటం జరుగుతున్నారు. అలాగే, స్మార్ట్ మీటర్ పథకం,



ఎంఎన్ఆర్ఇజిఎ పునరుద్ధరణ, గ్రామీణ ఉపాధిని బలహీనపరచడం, ప్రభుత్వ-కార్పొరేట్ కూటమి భూముల ఆక్రమణ, నాలుగు కార్మిక కోడ్‌ల విధించడం మొదలైన సమస్యలపై పోరాటం సాగుతోందని తెలిపారు.

## నరసరావుపేట ఆక్స్ ఫర్డ్ జూనియర్ కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య




**నరసారావుపేట, పతాకం న్యూస్:**పల్నాడు బాపట్ల జిల్లా నరసరావుపేట ఆక్స్ ఫర్డ్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం జరిగింది. నరసరావుపేట ఆక్స్ ఫర్డ్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన కొరకుల బాల కోటిరెడ్డి (18) అనే విద్యార్థి కళాశాల హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .... మృతి చెందిన కోటి రెడ్డికి నాలుగు నెలల క్రితం హెర్నియా ఆపరేషన్ జరిగింది అని తల్లి హైమావతి వివరించారు.

కాలేజీలో విద్యార్థుల వద్ద ఘర్షణ కారణంగానే తమ కొడుకు చనిపోయాడని హైమావతి ఆరోపించారు. ఈరోజు కళాశాల వార్డెన్ ఫోన్ చేసి 'మీ అబ్బాయికి ఆరోగ్యం బాగాలేదు' అని చెప్పారని 'మా అబ్బాయితో మాట్లాడాలి ఫోన్? ఇవ్వండి' అని అడుగగా మళ్ళీ చేస్తామని చెప్పారని కొంత సమయం తర్వాత 'మీ అబ్బాయి ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు' అని విలపించారు. సోమవారం హాస్టల్ గదిలో కోటిరెడ్డి ఒంటరిగా ఉన్న సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడని హాస్టల్ వార్డెన్, తోటి విద్యార్థులు గమనించే సమయానికి ప్రాణాలు కోల్పోయి ఉన్నాడని గుర్తించారని తెలిసినట్లు చెప్పారు. కళాశాల యాజమాన్యంవారు విద్యార్థి తరపు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన చేసి, విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమికంగా ఇది ఆత్మహత్యే అని నిర్ధారించారు. అయితే ఆత్మహత్యకు కారణాలు ఏమిటనే విషయంలో స్పష్టత లేదు. చదువు ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలా లేదా ఇతర కారణాలు ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కళాశాల యజమాన్యం బాధ్యత వహించాలని మృతుని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సరైన సౌకర్యాలు, పర్యవేక్షణ లేని కారణంగా విద్యార్థుల బలవన్మరణాలు సంభవిస్తున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆరోపిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తల ఎందుకు తిరుగుతుంది? కారణాలు ఏంటి?

ఏ మనిషైనా ఆనందమైన జీవితం గడపడానికి ఆరోగ్యాంగా ఉండడం చాలా అవసరం, సాధారణంగా మనం దగ్గు, జలుబు, అలసట, కళ్ళు తిరగడం, తల తిరగడం మొదలైన చిన్న చిన్న అనారోగ్యాలను పెద్దగా పట్టించుకోము. అయితే తల తిరగడం లాంటి చిన్న అనారోగ్యాలు ఒకొక్కసారి మన శరీరంలో తీవ్రమైన సమస్యలకు ముందుగా కనిపించే సంకేతాలు కావచ్చు. చాలా మందిలో తల తిరగడం అనే సమస్య తరచుగా కనిపిస్తుంది, ఈ సమస్యకు కారణాలు ఒకొక్కరిలో ఒకొక్క లాగా ఉండవచ్చు. దీని వలన అలసట, మైకం, స్పృహ తప్పిపోవడం మొదలైన లక్షణాలు ఉంటాయి. వెర్టిగో, స్ట్రోక్ కారణంగా తల తిరగడం అనే సమస్య కలగవచ్చు. చాలామందిలో అలసట ఎక్కువైతే తల తిరుగు తున్నట్టు అనిపిస్తుంది, మరికొంతమందిలో ఉన్నట్టుండి మైకం కమ్మినట్టు అనిపిస్తుంది. దీనికి గల కారణాలు ఇక్కడ వివరంగా తెలుసుకోవచ్చు.



రోజులో తగినంత నీళ్లు తీసుకోక పోవడం తల తిరగడానికి కారణమవుతుంది, శరీరంలో నీటి స్థాయిలు రక్త ప్రసరణ పై ప్రభావం చూపిస్తాయి, తగినంత నీరు తాగకపోతే రక్త ప్రసరణ తగ్గి దాని వలన తల తిరుగుతుంది. సాధారణంగా లో బీపీ ఉన్నవారిలో తల తిరగడం ఎక్కువగా కనిపిస్తుంది. మెదడుకి రక్త ప్రసరణ సరిగా జరగకపోవడం వలన తల తిరిగడం, మూర్ఛ పోవడం జరుగుతుంది. వెర్టిగో, మెనియర్స్ లాంటి చెవికి సంబంధించిన వ్యాధుల కారణంగా కుడా తల తిరుగుతుంది. శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువైనప్పుడు తల తిరగడం, మూర్ఛ పోవడం వంటి పరిస్థితులు ఏర్పడతాయి. మైగ్రేన్ అనేది ఒక రకమైన తలనొప్పి, ఈ సమస్య ఉన్నవారిలో తల తిరగడం తరచుగా జరుగుతుంది. మైగ్రేన్ ఉన్నవారికి పెద్ద శబ్దాలు విన్నా, ఎక్కువ కాంతిని చూసినా తల తిరగడం సంభవిస్తుంది.

అప్పుడప్పుడూ కొన్ని రకాల మందులను వాడడం వలన కూడా తల తిరగడం, నిద్ర మత్తు కలగడం మొదలైనవి జరుగుతాయి. చాలా మందిలో ఒత్తిడి కూడా తల తిరగడానికి కారణం అవుతుంది.

ప్రతీరోజూ సరైన నిద్ర లేకపోవడం, లేదా రాత్రి సమయాల్లో ఎక్కువగా పనిచేసే వారిలో తల తిరగడం సమస్య ఎక్కువగా కనిపిస్తుంది.

రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయి తగ్గడాన్ని అనీమియా అంటారు, రక్తహీనత కారణం వలన కూడా తల తిరగడం జరుగుతుంది.

సాధారణంగా తల తిరగడానికి ఒకొక్కరిలో ఒకొక్క కారణం ఉంటుంది, ఆ కారణాలను గుర్తిస్తే దానికి తగ్గట్టుగా సూచనలు పాటించాలి. తరచుగా తల తిరుగుతుంటే దానిని నివారించడానికి ఈ సూచనలు పాటించాలి. కొన్నిసార్లు ఈ లక్షణాలను విస్మరిస్తే అది స్ట్రోక్ కు కూడా కారణం అవ్వవచ్చు.

శరీరానికి అవసరమైనంత నీరు తాగకపోతే తల తిరిగే సమస్య వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ప్రతీరోజు కచ్చితంగా సరైన మోతాదులో నీరు త్రాగాలి. చాలామంది రోజులో మూడుసార్లు పెద్ద భోజనం చేస్తారు. దీనివలన రక్తంలో చక్కెర స్థాయి ఒక్కసారిగా పెరుగుతుంది, దీని వలన కళ్ళు తిరగడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. సాధారణంగా ఐరన్ లోపం ఉన్నవారికి తల తిరిగే సమస్య కూడా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఐరన్ అధికంగా ఉండే ఆకుకూరలు, బాదం మొదలైన వాటిని తీసుకోవడం ద్వారా ఈ సమస్యను తగ్గించవచ్చు. ఒత్తిడి, ఆందోళన తగ్గించుకోవడం ద్వారా తల తిరగడాన్ని నివారించవచ్చు. చాలామంది వ్యాయామం వలన తల తిరిగే లక్షణాలు ఎక్కువ అవుతాయి అని అపోహ పడుతూ ఉంటారు, కానీ ప్రతీరోజూ 30 నుండి 60 నిమిషాల పాటు వ్యాయామం చేయడం వలన శరీరం ఆరోగ్యంగా ఉండడంతో పాటు తల తిరగడం వంటి లక్షణాలు కూడా తగ్గుతాయి. రోజుకి కనీసం 7 నుండి 9 గంటలపాటు నిద్రపోవడం వలన తల తిరిగే లక్షణాలను తగ్గించవచ్చు. సాధారణంగా తల తిరగడానికి గల కారణాల వలనే తల బరువుగా అనిపించడం కూడా జరుగుతుంది. అయితే తల బరువుగా అనిపించడానికి ఒత్తిడి, ఆందోళన, సరైన నిద్ర లేకపోవడం ప్రధాన కారణాలుగా ఉన్నాయి. సైనటైటిస్ వలన కూడా కొన్నిసార్లు తల బరువుగా ఉంటుంది. ఇలా తల బరువుగా ఉన్నప్పుడు, పని చేయడానికి ఇబ్బందిగా ఉంటుంది. కొన్ని సందర్భాలలో నిద్రమత్తు వలన కూడా తల బరువుగా ఉన్నట్టు అనిపిస్తుంది.

తల తిరగడం సమస్యకు చికిత్స ప్రధానంగా, ఈ సమస్యను కలగజేసే కారణాలను బట్టి ఉంటుంది. ఒకవేళ పేషేంట్ కు మైగ్రేన్ లేదా తలనొప్పి అధికంగా ఉండడం వలన తల తిరిగితే చికిత్స మైగ్రేన్ కు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ తల తిరగడానికి కారణం రక్తహీనత ఐతే, రక్తహీనత కు సంబంధించిన చికిత్స చేయాల్సి ఉంటుంది. తల తిరగడం అనేది వ్యాధి కాదు, మన శరీరంలో ఇతర వ్యాధుల వలన కలిగే ఒక లక్షణం, కాబట్టి ఈ సమస్యకు చికిత్స కూడా ఆ వ్యాధులకు సంబంధించినదిగా ఉంటుంది.

# జుట్టు పెరుగుదలకు ఉపయోగపడే నూనెలు



జుట్టు పెరుగుదలకు మనం ఎన్నో రకాల ప్రయత్నాలను చేస్తూ ఉంటాం. వాటిలో జుట్టుకు నూనెను పట్టించడం కూడా ఒకటి. నూనె రాయడం వల్ల జుట్టు బలంగా, వేగంగా పెరుగుతుంది. జుట్టు పొడిబారకుండా, దెబ్బతినకుండా ఉంటుంది. జుట్టు రాలడం తగ్గుతుంది. చుండ్రుతో పాటు ఇతర ఇన్ఫెక్షన్ లు రాకుండా ఉంటాయి. జుట్టు పెరుగుదలకు నూనె అవసరమైనప్పటికీ మనలో చాలా మందికి ఎటువంటి నూనెను వాడాలో తెలియక ఇబ్బంది పడుతూ ఉంటారు. కనుక ఇప్పుడు మనం జుట్టు పెరుగుదలకు అవసరమయ్యే కొన్ని రకాల నూనెల గురించి అలాగే వీటిని వాడడం వల్ల మనకు కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

ఆముదం నూనెలో రిసినోనిక్ ఆమ్లం ఎక్కువగా ఉంటుంది. ఇది కుదుళ్లకు రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయ పడుతుంది. ఆముదం నూనెను రాసుకోవడం వల్ల జుట్టు రాలడం తగ్గుతుంది. జుట్టు నల్లగా, దృఢంగా పెరుగుతుంది. అలాగే జోజోబా ఆయిల్ ను వాడడం వల్ల జుట్టు ఎల్లప్పుడూ తేమగా ఉంటుంది. తలచర్మం పొడిబారే సమస్య ఉన్న వారు జోజోబా ఆయిల్ ను వాడడం వల్లమంచి ఫలితం ఉంటుంది. రోజ్ మేరీ ఆయిల్ ను వాడడం వల్ల కుదుళ్లకు రక్తప్రసరణ పెరుగు తుంది. దీంతో జుట్టు రాలడం తగ్గుతుంది. అంతేకాకుండా రాలిన జుట్టు త్వరగా వచ్చేలా ప్రేరేపించడంలో కూడా ఈ నూనె తోడ్పడుతుంది.

టీ ట్రీ ఆయిల్ ను వాడడం వల్ల తల చర్మం ఆరోగ్యం మెరుగుపడుతుంది. జుట్టు కుదుళ్లు శుభ్రపడతాయి. టీ ట్రీ ఆయిల్‌లో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఇన్ఫెక్షన్‌లను, చుండ్రు సమస్యను తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే జుట్టు పెరుగుదలకు కొబ్బరి నూనెను మనం ఎంతో కాలంగా ఉపయోగిస్తూనే ఉన్నాం. ఈ నూనెను వాడడం వల్ల జుట్టుకు పోషణ లభిస్తుంది. జుట్టు బలంగా, వేగంగా పెరుగుతుంది. పెప్పర్‌మింట్ ఆయిల్‌ను వాడడం వల్ల జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. కుదుళ్లు బలంగా తయార వుతాయి. జుట్టు వేగంగా పెరగడంలో కూడా ఇది మనకు సహాయపడుతుంది.

ఆలివ్ ఆయిల్‌లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఇ ఎక్కువగా ఉంటాయి. ఈ నూనెను వాడడం వల్ల జుట్టుకు కాంతి చేకూరుతుంది. జుట్టు పొడిబారడం, జుట్టు చివర్లు చిట్లడం వంటి సమస్యలు తగ్గుతాయి. బాదం ఆయిల్ ను వాడడం వల్ల ఎండ నుండి, కాలుష్యం నుండి జుట్టు దెబ్బతిన కుండా ఉంటుంది. జుట్టు పొడిబారడం తగ్గుతుంది. జుట్టు రాలడం, జుట్టు తెగిపోవడం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. అలాగే గుంటగలగర ఆకుల నూనెకు ఆయుర్వే దంలో ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ నూనెను వాడడం వల్ల జుట్టు పెరగడమే కాకుండా జుట్టు తెల్లబడకుండా ఉంటుంది. ఇలా ఆయా నూనెలు పలు భిన్న రకాల జుట్టు సమస్యలను తగ్గించడంలో స?హాయం చేస్తాయి. అయితే వీటిల్లో ఏ నూనె వాడాలనేది వారికున్న జుట్టు సమస్యలు, వారికున్న సౌకర్యం బట్టి ఆధార పడి ఉంటుంది.

# పరిరక్షణ ప్రాంతంగా అభివృద్ధి కానున్న 'కొండకర్ల ఆవ'



**అచ్యుతాపురం, పతాకం న్యూస్:** అచ్యుతాపురం, మునగపాక మండలాలకు విస్తరించి ఉన్న కొండకర్ల ఆవకు మహర్దశ పట్టనుంది. దీనిని ప్రాశస్త్యాన్ని గుర్తించి 'వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్టు-1972' కింద పరిరక్షణ ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. తాజాగా అనకాపల్లి ఉత్సవ్‌లో భాగంగా రెండు రోజులపాటు ఇక్కడ పలు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్తరాంధ్రలో అతి పెద్ద మంచినీటి సరస్సుగా పేరుగాంచిన కొండకర్ల ఆవ.. 1,863 ఎకరాల విస్తీర్ణం, 14 కిలోమీటర్ల వైశాల్యం కలిగి వుంది. నీటి నిల్వ సామర్థ్యం 180.9 మిలియన్ ఘనపుటడుగులు. ఆవ ఆయకట్టు సుమారు రెండు వేల ఎకరాలు. శారదా నది నుంచి కృష్ణంరాజు కాలువ ద్వారా ఆవలోకి వర్షం నీరు చేరుతుంది. ఆవలో నిండితే కళింగ లాకుల ద్వారా దిగువకు పోతుంది. ఆవ పూర్తిగా నిండితే సుమారు 20 అడుగుల లోతున నీరు వుంటుంది. సుమారు 200 మత్స్యకార కుటుంబాలు ఆవలో చేపల వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నాయి. కాగా కొండకర్ల ఆవలో సుమారు వంద ఎకరాలు ఆక్రమణకు గురయాయి. కబ్జాదారులతో రెవెన్యూ అధికారులు కుమ్మక్కై కొంతమందికి డి.పట్టాలు సైతం జారీ చేశారు. రాజకీయ పలుకుబడితో మరికొందరు డి.పట్టాలు పొందారు.

కొండకర్ల ఆవను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సుమారు రూ.40 కోట్లతో ప్రణాళికలు సిద్దం చేసింది. సెజ్?లో ఒక కర్మాగారం సీఎస్ఆర్ నిధులతో కొండకర్ల ఆవను అభివృద్ధి చేస్తామని ఎంఓయూ చేసుకున్నారు. నీరు-చెట్టు కార్యక్రమం కింద ఆవగట్లను వెడల్పు చేయడంతోపాటు ఫలసాయాన్నిచ్చే చెట్ల పెంపకం చేపట్టాలని నిర్ణయించి కొంతమేర పనులు కూడా జరిగాయి. ఆవలో పూడిక తీయించి చేపల పెంపకంతోపాటు బోటు షికారు ఏర్పాటు చేయాలని, పర్యాటకుల వసతి కోసం రిసార్టు నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ సమయంలో వైసీపీ అధికారంలోకి రావడంతో ఇవి కార్యరూపం దాల్చలేదు. రిపేర్, రెనోవేషన్, రెస్టొరేషన్ (ఆర్ఆర్ఆర్) కార్యక్రమంలో భాగంగా ఆవను ఆధునీకరించడానికి అనకాపల్లి గత ఎంపీ సత్యవతి చొరవతో కేంద్ర ప్రభుత్వం 2021లో ముందుకొచ్చింది. కానీ జగన్ ప్రభుత్వం చొరవచూపకపోవటంతో అమలు కాలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పర్యాటక ప్రదేశాలను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ జాబితాలో కొండకర్ల ఆవ కూడా వున్నట్టు అధికార వర్గాల సమాచారం. ఇదిలావుండగా ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న అనకాపల్లి ఉత్సవ్‌లో కొండకర్ల ఆవను కూడా చేర్చారు. రెండు రోజులపాటు ఇక్కడ బోటింగ్, జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు, స్థానిక ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు.

## రెండు గిడ్డంగుల్లో అగ్నిప్రమాదం
## ఎనిమిది మంది సజీవదహనం



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో పక్కపక్కనే ఉన్న రెండు గిడ్డంగుల్లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఎనిమిది సజీవదహనమయ్యారు. 24 గంటలు గడిచినా మంటలు అదుపులోకి రాలేదని అధికారులు మంగళవారం తెలిపారు. ఈ ఘటనం అర్ధరాత్రి సమయంలో జరిగింది. ఈ రెండు గిడ్డంగులు రాజధాని కోల్‌కతా శివార్లలోని నజీరాబాద్ ప్రాంతంలో ఉన్నాయి. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో ఈ గిడ్డంగుల్లో అనేకమంది కార్మికులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక దళం తెల్లవారుజామున మూడు గంటల సమయానికి 12 అగ్నిమాపక యంత్రాలతో ఘటనా స్థలానికి చేరుకుని ఏడు గంటలపాటు తీవ్రంగా శ్రమించి మంటల్ని అదుపులోకి తెచ్చారు. అయితే కొన్ని ప్రాంతాల్లో మంటలు చెలరేగుతూనే ఉన్నాయని అధికారులు తెలిపారు కాగా, సోమవారం రాత్రి ఈ ఘటనలో సజీవదహమైన వారి అస్థికల్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనలో మృతి చెందినవారు పూర్బా మెదినీపూర్, పశ్చిమ మెదినీపూర్, దక్షిణ 24 పరగణాల జిల్లాలకు చెందినవారిగా పోలీసులు గుర్తించారు. చనిపోయినవారెవరో తెలుసుకోవడానికి కుటుంబ సభ్యుల నుంచి డిఎన్?ఎ శాంపిల్స్‌ని సేకరిస్తున్నట్లు అగ్నిమాపక శాఖా వర్గాలు తెలిపాయి. అగ్నిప్రమాదం సంభవించడానికి గల కారణాలు, నష్టానికి సంబంధించిన వివరాలపై స్పష్టత లేదు. 5 గంటల సమయానికి మూడు మృతదేహాలను రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. ఆ తర్వాత ఐదు మృతదేహాలు.. మొత్తం ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందారు. ఈ ప్రమాదంలో గుర్తుపట్టలేని విధంగా కాలిపోవడంతో మృతులెవరినీ గుర్తించలేకపోయాము. మొదట గిడ్డంగుల్లో ఆరుగురే చిక్కుకున్నట్లు వార్తలొచ్చాయి. ఆ తరువాత అందులో దాదాపు పదిమంది ఉండొచ్చుని.. వారందరూ చనిపోయి ఉంటారని వారి కుటుంబ సభ్యులు ఆందళన చెందుతున్నట్లు బరుయిపూర్ ఎస్పీ శుభేందు కుమార్ తెలిపారు. ఈ ఘటనలపై పశ్చిమబెంగాల్ అగ్నిమాపక సేవల మంత్రి సుజిత్ బోస్ విచారం వ్యక్తం చేశారు. ఘటనా స్థలంలో రెస్క్యూ ఆపరేషన్స్ కొనసాగుతున్నాయి.




## టీ20 ప్రపంచ కప్ జట్టును ప్రకటించిన స్కాట్లాండ్




భారత్, శ్రీలంక వేదికలుగా త్వరలో ప్రారంభం కానున్న ఐసిసి మెన్స్ టి 20 ప్రపంచ కప్ 2026 నుంచి బంగ్లాదేశ్ తప్పుకున్న విషయం తెలిసిందే. భద్రతా కారణాలను కారణంగా చూపుతూ భారత్‌లో మ్యాచ్‌లు ఆడేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నిరాకరించడంతో, ఐసిసి ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ఎంపిక చేసింది. ఈ మెగా టోర్నీ కోసం స్కాట్లాండ్ క్రికెట్ బోర్డు ఇప్పటికే తమ 15 మంది సభ్యుల బృందాన్ని ప్రకటించింది. గ్రూప్‌సి లో ఉన్న స్కాట్లాండ్.. కోల్‌కతా వేదికగా ఫిబ్రవరి 7 న వెస్టిండీస్, 9న ఇటలీ, 14న ఇంగ్లాండ్‌తో తలపడనుంది. ఫిబ్రవరి 17న ముంబయిలో నేపాల్‌ను ఢీ కొట్టనుంది. 15 మంది సభ్యులతో కూడిన స్కాట్లాండ్ టీంకు రిచీ బెరింగ్టన్? నాయకత్వం వహించనున్నారు. 2024 ఎడిషన్‌లో ఆడినవారిలో 11 మంది ఈసారి కూడా అవకాశాన్ని దక్కించుకున్నారు. ఎవరైనా ఆటగాడు గాయపడితే వెంటనే జట్టులో చేరేందుకు వీలుగా ఇద్దరిని ట్రావెలింగ్ రిజర్వ్‌లు, ముగ్గురిని నాన్ ట్రావెలింగ్ రిజర్వ్‌లుగా ఎంపిక చేశారు.

## నాలుగో టీ20లో..
# శ్రేయస్ అయ్యర్‌కు అవకాశం దక్కేనా?




భారత్‌లో న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లకు కూడా శ్రేయస్ అయ్యర్ జట్టుతోనే కొనసాగనున్నాడు. యంగ్ బ్యాటర్? తిలక్ వర్మకు సిరీస్‌కు ముందు సర్జరీ కావడంతో అతడి స్థానంలో తొలి మూడు మ్యాచ్‌లకు అయ్యర్‌ను ఎంపిక చేశారు. అయితే తిలక్ ఇంకా పూర్తిగా ఫిట్‌నెస్ సాధించకపోవడంతో మిగిలిన రెండు టీ20లకు కూడా అయ్యర్‌ను కొనసాగిస్తున్నట్లు బీసీసీఐ ప్రకటన విడుదల చేసింది.

ఈ సిరీస్‌లో ఇప్పటికే మూడు మ్యాచ్‌లు ముగిశాయి. అయితే తిలక్ స్థానంలో జట్టులోకి వచ్చిన అయ్యర్‌కు ఇప్పటిదాకా తుది జట్టులో చోటు దక్కలేదు. అతడు బెంచ్‌కే పరిమితమయ్యాడు. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనైనా బరిలోకి దిగుతాడో లేదో చూడాలి మరి. ఇక ఈ సిరీస్‌ను భారత్ ఇప్పటికే 3- 0 తేడాతో కైవసం చేసుకుంది. తొలి మూడు మ్యాచ్‌ల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించిన టీమ్ఇండియా హ్యాట్రిక్ కొట్టింది. ఇరుజట్ల మధ్య జనవరి 28న నాలుగో టీ20 జరగనుంది. ఈ మ్యాచ్‌కు విశాఖపట్టణం వేదిక కానుంది.

కాగా, గతేడాది చివర్లో విజయ్ హజారే మ్యాచ్ ఆడుతుండగా తిలక్ గాయపడ్డాడు. అతడి పొట్ట కింది భాగంలో నొప్పి రావడంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అనంతరం అతడు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకుంటున్నాడు. ఫిట్‌నెస్ సాధించేందుకు తిలక్ తీవ్రంగా శ్రమిస్తున్నాడు. అయితే ఈనెల 31నాటికి పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడని ఉదయం వార్తలు వచ్చాయి. కానీ అప్పటికి తిలక్ ఫిట్‌నెస్ సాధించినా, నేరుగా అతడు టీ20 వరల్డ్‌కప్‌లోనే దిగుతాడు. ఫిబ్రవరి 3న ముంబయిలో భారత జట్టుతో కలుస్తాడు. ఫిబ్రవరి 4న డీ.వై.పాటిల్ స్టేడియంలో సౌతాఫ్రికాతో జరిగే వార్మప్ మ్యాచ్‌లో ఆడుతాడు.

మిగిలిన రెండు టీ20లకు భారత్ జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్, హార్దిక్ పాండ్య, శివమ్ దూబే, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), రింకు సింగ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, ఇషాన్ కిషన్, రవి బిష్ణోయ్

ఇటీవల వడోదర వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో పక్కటెముకల గాయం కారణంగా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ మిగిలిన వన్డేలు, టీ20 సిరీస్‌కు దూరమయ్యాడు. అయితే అతడికి ఇంకా రెండు వారాల విశ్రాంతి అవసరమని సమాచారం. అయితే భారత్ ఇప్పటికే ప్రకటించిన టీ20 వరల్డ్ కప్? జట్టులో సుందర్ ఉన్నాడు. కానీ సుందర్ కోలుకోడానికి సమయం పడితే ఎవరితో ఆ స్థానాన్ని రిప్లేస్? చేస్తారని ఆసక్తిగా ఉంది. అయితే లెగ్? స్పిన్నర్ రవి బిష్ణోయ్ ప్రస్తుతం టీమ్ఇండియాకు బ్యాకప్ స్పిన్నర్‌గా ఉన్నాడు. వచ్చే నెల 7 నుంచి టీ20 వరల్డ్ కప్ ప్రారంభం కానుంది. భారత్, శ్రీలంక సంయుక్త వేదికలుగా ఈ టోర్నీ జరగనుంది.




# సెప్టెంబర్ 11న థియేటర్స్‌కు రానున్న 'రణబాలి'

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో టీ సిరీస్ సమర్పణలో ప్రెస్టీజియస్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న క్రేజీ మూవీకి "రణబాలి" అనే టైటిల్ ను ఖరారు చేశారు. టైటిల్ గ్లింప్స్ విడుదలతో పాటు సినిమా రిలీజ్ డేట్ ను కూడా అనౌన్స్ చేశారు. ఈ సినిమా సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ కు రాబోతోంది. "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు.



ఈ సినిమా గ్లింప్స్ లో రణబాలి అనే యోధుడి పాత్రలో విజయ్ దేవరకొండ కనిపించిన తీరు ఆకట్టుకుంటోంది. తన మాతృభూమి కోసం ప్రాణాలు ఒడ్డి పోరాడే రణబాలి పాత్రలో విజయ్ ఒదిగిపోయారు. హీరోయిన్ రశ్మిక మందన్న జయమ్మగా కనిపించింది. ప్రతినాయకుడు సర్ థియోడోర్ హెక్టార్ పాత్రలో 'మమ్మీ' సినిమా ఫేమ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ నటించారు. పచ్చటి పైరులతో అలరారే మన గ్రామసీమలను బ్రిటీష్ క్రూర పాలకులు కరువు ప్రాంతాలుగా ఎలా మార్చారో ఈ గ్లింప్స్ లో బాధాకరంగా చూపించారు. ఆర్థికంగా పీల్చిపిప్పి చేస్తూ మన సమాజంలో హిట్లర్ ఊచకోతను మించిన మారణహోమాన్ని బ్రిటీషర్స్ ఎలా సృష్టించారో గ్లింప్స్ రిఫ్లెక్ట్ చేసింది. బ్రిటీష్ అధికారిని గుర్రానికి కట్టి రైల్వే ట్రాక్ పై రణబాలి ఈడ్చుకుంటూ వెళ్లే సీన్ గ్లింప్స్ కు హైలైట్ గా నిలుస్తోంది.

19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా "రణబాలి" సినిమా రూపొందుతోంది. 'డియర్ కామ్రేడ్', 'ఖుషి' వంటి సక్సెస్ ఫుల్ సినిమాల తర్వాత మైత్రీ మూవీ మేకర్స్, విజయ్ కలిసి చేస్తున్న మూడో చిత్రమిది. 'టాక్సీవాలా' లాంటి సూపర్ హిట్ తర్వాత విజయ్ దేవరకొండ, రాహుల్ సంకృత్యన్ ఈ సినిమాతో మరోసారి కలిసి పనిచేస్తున్నారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత "రణబాలి"లో మూడోసారి రశ్మిక, విజయ్ జంటగా నటించారు.

# రవితేజ కొత్త సినిమా 'ఇరుముడి'



స్టార్ హీరో రవితేజ తన కొత్త సినిమా టైటిల్ ప్రకటించారు. రవితేజ హీరోగా శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు 'ఇరుముడి' అనే టైటిల్ ఖరారు చేసినట్లు ప్రకటన చేశారు. ఈ మేరకు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు. ఇందులో రవితేజ అయ్యప్ప స్వామి భక్తుడిగా కనిపిస్తున్నారు. ఫస్ట్ లుక్ టైటిల్‌ను చూస్తే ఈ సినిమా రవితేజ ఇటీవలి చిత్రాలకు భిన్నంగా ఉంటుందని అనిపిస్తోంది. ఈ ప్రకటనలతో ప్రాజెక్ట్‌పై అంచనాలు పెరిగాయి. ఇందులో ఆయనకు జోడీగా తమిళ నటి ప్రియా భవాని శంకర్ నటిస్తోంది. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. జీ.వీ. ప్రకాశ్ కుమార్ సంగీత దర్శకుడిగా పనిచేస్తున్నారు. షూటింగ్ వివరాలు, అలాగే విడుదల ప్రణాళికలను త్వరలో ప్రకటించనున్నారు. పోస్టర్ చూస్తుంటే సినిమా డివోషనల్ టచ్‌లో ఉండనున్నట్లు తెలుస్తోంది. రవితేజ అయ్యప్ప మాలధారణలో కనిపిస్తున్నారు. ఒక చేత్తో తలపైమీద ఇరుముడిని పట్టుకోవడం, మరో చేత్తో ఓ పాపని ఎత్తుకొని ఉన్నారు. కాగా, రవితేజ 77వ చిత్రంగా ఈ సినిమా తెరపైకి రానుంది. 'కొన్ని కథలు జీవితంలో సరైన సమయంలో మనల్ని వెతుక్కుంటూ వస్తాయి. మరోసారి ఇలాంటి సినిమాలో భాగం అవ్వడం అదృష్టంగా భావిస్తున్నాను. శివ నిర్వాణతో ఇరుముడి సినిమా ప్రయాణాన్ని ప్రారంభించేందుకు ఆత్రుతగా ఉన్నాను. స్వామియే శరణం అయ్యప్పా' అని రవితేజ ఈ పోస్ట్‌ను రీ ట్వీట్ చేశారు. దర్శకుడు శివ నిర్వాణ ఇప్పటికే 'మజిలీ', 'నిన్నుకోరి' లాంటి ఫీల్‌గుడ్ సినిమాలు తెరకెక్కించారు. క్లాసిక్ సినిమాలు తీయడంలో సక్సెస్ అయ్యారు. అయితే హీరో రవితేజ మాస్‌కు మరో పేరు. అలాంటిది ఈ క్లాస్- మాస్ కాంబినేషన్ ప్రేక్షకుల్లో ఆసక్తి కలిగిస్తుంది. మరి ఇందులో రవితేజ పాత్ర ఏంటి స్టోరీ ఎలా ఉండనుందో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే!




# 'హ్యాపీ' చిత్రం విడుదలై 20 ఏళ్లు పూర్తి.. సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టిన అల్లు అర్జున్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిన 'హ్యాపీ' చిత్రం విడుదలై నేటితో 20 ఏళ్లు పూర్తయింది. 2006 జనవరి 27న విడుదలైన ఈ సినిమా రెండు దశాబ్దాల మైలురాయిని చేరుకున్న సందర్భంగా అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా ఓ భావోద్వేగ పోస్ట్?ను పంచుకున్నారు. తన సినీ ప్రయాణంలో అత్యంత సంతోషాన్నిచ్చిన చిత్రాలలో 'హ్యాపీ' ఒకటని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఎ. కరుణాకరన్‌కు, తన సహనటి జెనీలియాకు, విలక్షణ నటుడు మనోజ్ బాజ్‌పాయ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అద్భుతమైన సంగీతంతో సినిమాకు ప్రాణం పోసిన యువన్ శంకర్ రాజాను, ఇతర సాంకేతిక నిపుణులను ఆయన ప్రశంసించారు. అలాగే, ఈ చిత్రాన్ని నిర్మించిన తన తండ్రి అల్లు అరవింద్‌కు, గీతా ఆర్ట్స్ సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎ. కరుణాకరన్ దర్శకత్వంలో వచ్చిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ అప్పట్లో మంచి విజయాన్ని సాధించింది. తెలుగులోనే కాకుండా మలయాళంలో కూడా 'హ్యాపీ' ఘన విజయం సాధించి, అక్కడ అల్లు అర్జున్?కు బలమైన అభిమాన గణాన్ని సంపాదించి పెట్టింది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**